ప్రజాశక్తి

శుక్రవారం 6 సెప్టెంబర్ 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

వీడని కష్టాలు

సింగ్‌నగర్‌లో సామాను చేరవేసుకుంటున్న బాధితులు

- నేటికీ వరద నీటిలోనే బాధితులు
- అన్నపానీయాల కోసం శివారు ప్రాంతాల్లో ఎదురుచూపులు
- సర్వం కోల్పోయిన 30 వేల కుటుంబాలు
- ఇంటి సామానంతా నీటి పాలు
- ముంపు ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి-విజయవాడ: బుడమేరు వరద సింగ్‌నగర్‌ను ముంచెత్తింది... 30 వేల కుటుంబాలు సర్వం కోల్పోయాయి... ఇళ్లల్లోని సామాన్లు మొత్తం నీటి పాలయ్యాయి... కోళ్లు, పశువులు, మేకలు, గొర్రెలు, కుక్కలు వరదలో కొట్టుకుపోయాయి... ఇది జరిగి ఐదు రోజులైనా బాధితులను కష్టాలు వీడటంలేదు. కూలీ నాలీ మీద ఆధారపడి జీవించే పేదల కుటుంబాల్లో వరద బీభత్సం సృష్టించింది. ఇంకా అనేక ప్రాంతాల్లోని రెండు లక్షల మందికిపైగా బాధితులు జల దిగ్బంధనంలోనే ఉన్నారు. వరద ఉధృతి తగ్గినా ఇళ్ల చుట్టూ ఉన్న నీటితో మురుగు మధ్యలోనే మగ్గిపోతున్నారు. నేటికీ మురుగునీటి మధ్యే కాలం గడుపుతున్న వారి అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇంకా ఆహారం, మంచినీటి కోసం ఎగబడుతున్నారు. సింగ్‌నగర్ శివారు ప్రాంతాల్లో ఆకలితో ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించడంలోనూ అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. క్రమంగా వరద తగ్గుముఖం పట్టుతుండటంతో ఇళ్లు, ఇళ్ల చుట్టూ మురుగునీరు, బురద చేరింది. ఇళ్లల్లోని పరుపులు, దిండ్లు, బట్టలు, ఇతర సామాగ్రి మొత్తం వీధుల్లోకి కొట్టుకొచ్చి మేట వేశాయి. ఇళ్ల మధ్య మురుగుతో దుర్వాసన వస్తోంది. వ్యాధులు విజృంభించే పరిస్థితి ఉందని బాధితులు భీతిల్లుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర హోం శాఖ అదనపు కార్యదర్శి సంజీవ్ కుమార్ జిందాల్ నేతత్వంలో వచ్చిన ప్రత్యేక బందం పర్యటించింది. అలాగే కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఏరియల్ సర్వే నిర్వహించారు. ... వార్తలు మెయిన్, టబ్లాయిడ్‌లో

• 'పానీ'పట్టు యుద్ధం

శాంతించిన కృష్ణమ్మ

ప్రకాశం బ్యారేజి వరద బాగా తగ్గిపోయింది. గురువారం రాత్రి 10 గంటల సమయానికి ఇన్‌ఫ్లో 1,34,532 క్యూసెక్కులుగా ఉంది. దీనిలో 1,34,330 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. బ్యారేజికి చెందిన మొత్తం 70 గేట్లలో 65 గేట్లను మూడు అడుగుల మేర, ఒక గేటును పూర్తిగా ఎత్తి నీటిని వదులుతున్నారు. నాలుగు గేట్లను పూర్తిగా ఎత్తివేశారు. అలాగే 202 క్యూసెక్కులను కాల్వలకు వదులుతున్నారు.

చల్లపల్లి మండలం మాజేరులో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

కాగితాల్లోనేనా... ఆచరణలో చూపుతారా..?

- కృష్ణాలో మొదలైన పంట నష్టం అంచనా
- వాస్తవ సాగుదారులనే గుర్తించాలని ప్రభుత్వం ఉత్తర్వులు
- ప్రాథమికంగా ముంపుకు గురైన వ్యవసాయ పంటలు 37,832 హెక్టార్లు
- అత్యధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తోంది కౌలు రైతులే

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి: భారీ వర్షాలు, వరదలకు ముంపుకు గురైన పంటల నష్ట అంచనా (ఎన్యుమరేషన్) ప్రక్రియ కృష్ణాజిల్లాలో గురువారం మొదలైంది. 363 రైతు సేవా కేంద్రాలు (ఆర్‌ఎస్‌కె)ల పరిధిలో పంట నష్ట గణన అంచనాల ప్రక్రియ మొదలైంది. క్షేత్రస్థాయిలో నష్టపోయిన పంటలను గుర్తించే క్రమంలో వాస్తవ సాగుదారుల పేర్లనే జాబితాలో నమోదు చేయాలని ఈ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నేపథ్యంలో జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తున్న వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు ఈ ఉత్తర్వులు ప్రయోజనం కలిగిస్తాయా... కాగితాలకే పరిమితమవుతుందా అనేది చర్చనీయాంశమైంది.

క్షేత్రస్థాయిలో నమోదుకు బృందాలు

కృష్ణాజిల్లాలోని 363 రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ నెల 10వ తేదీ నాటికి నష్టం అంచనాలను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గ్రామ స్థాయిలో గ్రామ రెవెన్యూ అధికారి (విఆర్‌వో), గ్రామ వ్యవసాయ సహాయకులు (విఎఎ)లు, మండల స్థాయిలో తహశీల్దార్, మండల వ్యవసాయ అధికారి(ఎవో), డివిజన్ స్థాయిలో డివిజనల్ రెవెన్యూ అధికారి (ఆర్డీవో), వ్యవసాయ సహాయ సంచాలకులు (ఎడిఎ) మూడు (మిగతా 2లో)

సిపిఎం ఆధ్వర్యాన ఆహారం, మంచినీరు పంపిణీ

- జక్కంపూడి, పాయకాపురం ప్రాంతాల్లో నేతల పర్యటన

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ)

బుడమేరు వరద బాధిత ప్రాంతాల్లో గురువారం సిపిఎం బందం పర్యటించింది. విజయవాడ జక్కంపూడిలోని వైయస్సార్ కాలనీ, పాయకాపురంలోని పటేల్ నగర్, ఎల్బీఎస్ నగర్, జోజి నగర్ తదితర ప్రాంతాల్లో సిపిఎం నేతలు పర్యటించి వేలాది మందికి మంచినీరు, ఆహార పదార్థాలు, బిస్కెట్లు, పాలు, దోమల చక్రాలు, అగ్గిపెట్టెలు తదితర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, పశ్చిమ నియోజకవర్గ కార్యదర్శి బోయి సత్యబాబు తదితరులు వరద బాధితులను పరామర్శించి సహాయ సహకారాలు అందించారు. ఈ సందర్భంగా బాబూరావు, సత్యబాబు మాట్లాడుతూ నగరంలో ఏనాడు లేనివిధంగా అటు కష్ణానది, ఇటు బుడమేరు వరదల వలన దాదాపు 30 డివిజన్లలోని లక్ష యాభై వేల కుటుంబాలలోని ఐదు లక్షల మంది పైగా ప్రజలు ముంపుకు గురయ్యారన్నారు. గత ఆరు రోజుల నుండి భారీ (మిగతా 2లో)

ముంపు ప్రాంతాల్లో సిపిఎం సహాయక చర్యలు చేపట్టిన సిపిఎం నేతలు బాబూరావు, సత్యబాబు

గుడ్లవల్లేరు కళాశాలలో కెమెరాలు లేవు

ఐజి అశోక్‌కుమార్

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో బాలికల వసతి గృహం బాత్రూంలో పోలీసులు నేరుగా చేసిన దర్యాప్తులో ఎటువంటి స్పై కెమెరాలు గుర్తించలేదని ఐజి అశోక్‌కుమార్ వెల్లడించారు. గురువారం గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ బాలికల వసతి గహం బాత్రూంలో రహస్య కెమెరాలు సంఘటనపై ఏపీలో తొలిసారిగా కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ ఢిల్లీ టీం సేవలు వినియోగించామని, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల అనుమానాలు నివత్తి చేసామని అన్నారు. హాస్టల్ వాష్ రూముల్లో కెమెరాలు ఏర్పాటు చేశారంటూ ఆరోపణలు వచ్చిన వెంటనే

సమావేశంలో మాట్లాడుతున్న ఐజి అశోక్‌కుమార్

క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. విద్యార్థులు, స్త్రీ శిశు సంక్షేమ, పోలీసు బృందాల సమక్షంలో ఆరోపణలు వచ్చిన వెంటనే హాస్టల్ వాష్ రూముల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. వాష్ రూమ్‌ల షవర్లలో ఎటువంటి కెమెరాలు లేవని తేలిందన్నారు. విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది, ఉద్యోగులు అందరినీ నేరుగా విచారించామని, విచారణలో కెమెరాలుకానీ, వీడియోలు కానీ ప్రత్యక్షంగా చూసినట్లు ఏ ఒక్కరు తెలపలేదన్నారు. కెమెరాల ఏర్పాటు, వీడియోలు అంశం ఎవరో చెప్తేనే తమకు తెలిసిందనీ విచారణలో అందరూ పేర్కొన్నారన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థుల ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లను స్వాధీనం చేసుకుని తొలిసారిగా సిఇ ఆర్‌టి సేవలు వినియోగించామన్నారు. తాము స్వాధీనం చేసుకున్న 14 ఫోన్లు, 6 ల్యాప్ ట్యాప్లు, ఒక ట్యాబ్‌ను బృందం సభ్యులకు అప్పగించామన్నారు. విద్యార్థులు ఎవరు భయపడనవసరం లేదని నేరుగా చేసిన దర్యాప్తులో ఎటువంటి స్పై కెమెరాలు లభ్యం కాలేదని పేర్కొన్నారు. ఢిల్లీ సంస్థ సిఇ ఆర్‌టి టెక్నికల్ విచారణ జరుగుతుందని, మరో మూడు రోజుల్లో ఆ నివేదిక కూడా వస్తుందని చెప్పారు. ఈ ఘటనపై ఎటువంటి ఆధారాలున్నా పోలీసుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. అదే విధంగా కళాశాల యజమాన్యానికి తగు సూచనలు చేశామని చెప్పారు. ఈ సమావేశంలో కష్ణా జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు, డిసిపి లలితకుమారి, సిఐ రవణమ్మ పాల్గొన్నారు.

బుడమేరులో కొట్టుకువచ్చిన మృతదేహం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం పైడూరుపాడు గ్రామంలోకి వచ్చిన బుడవేరు వరద నీటిలో ఓ గుర్తు తెలియని మృతదేహం కొట్టుకువచ్చింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని బుడమేరు నుండి బయటకు తీశారు.

కృష్ణాలో 42.3 మిమీ వర్షపాతం

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

కృష్ణాజిల్లాలోని 25 మండలాల్లోనూ గురువారం వర్షం కురిసింది. రోజంతా ఆకాశం మేఘావృతమై ఉండటం, మరో వాయుగుండం ముప్పు ఉందని ఊహాగానాలు వెలువడటంతో ఇప్పటికే వరదలు, భారీ వర్షాలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలను ఆందోళనకు గురిచేసింది. బుధవారం 8.30 గంటల నుంచి నుంచి గురువారం 8.30 గంటల వరకు 42.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ముంపు బారి నుంచి బయటపడని బుడమేరు పరివాహక ప్రాంతంలోనే ఎక్కువగా వర్షం కురిసింది. ఆ ప్రాంతాలు ముంపు నుంచి బయటపడటంలో మరింత ఆలస్యం అవుతోంది. ఉంగుటూరులో అత్యధికంగా 94.2, గుడివాడలో 68.6, గన్నవరంలో 65.8, బంటుమిల్లిలో 62.4, మచిలీపట్నంలో 56.2, నందివాడలో 54.4, పెదపారుపూడిలో 52.2, మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. మచిలీపట్నం మినహా మిగిలిన అన్ని మండలాల్లోని వర్షపు నీరు బుడమేరుకు చేరుతుంది. గుడ్లవల్లేరులో 50.4, పమిడిముక్కలలో 48.2, పామర్రులో 47.2, వుయ్యూరులో 43.4, గూడూరులో 43.2, తోట్లవల్లూరులో 37.6, కృత్తివెన్నులో 32.2, కోడూరు 28.8, మొవ్వ 26.4, పెనమలూరు 25.6, కంకిపాడు 25.2, చల్లపల్లి 24.6, మోపిదేవి 18.2, అవనిగడ్డ 15.6 మిల్లీ మీటర్లు వర్షం కురిసింది.

బందరులో నీటమునిగిన రోడ్లు

అత్యల్పంగా నాగాయలంకలో 7.0 మిల్లీ మీటర్లు నమోదైంది. వర్షానికి బందరులో రహదారులన్నీ నీట మునిగాయి. ప్రయాణికులు, వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. రోడ్డు పక్కన హాకర్స్ మధ్యాహ్నం వరకు వ్యాపారాలు చేయలేని పరిస్థితి ఏర్పడింది.

మొదటిపేజీ తరువాయి

కాగితాల్లోనేనా... ఆచరణలో చూపుతారా..?

బృందాలు నష్టం అంచనాలను నివేదికలను రూపొందిస్తున్నాయి. ఈ నెల పదో తేదీకి నష్టపోయిన రైతుల జాబితాను సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నెల 11 నుంచి 16వ తేదీ నివేదికను (సోషల్ ఆడిట్)కు పరిశీలనకు ఆర్‌ఎస్‌కెల్లో ఉంచుతారు. అభ్యంతరాలను స్వీకరించి తుది నివేదికను 18వ తేదీకి ప్రభుత్వానికి జిల్లా యంత్రాంగం అందించాల్సి ఉంది.

ముంపు ఇలా

కృష్ణాజిల్లాలో 1,36,763 హెక్టార్లలో వ్యవసాయ పంటలు సాగవుతుండగా 37,832 హెక్టార్లలో పంటలు ముంపుకు గురైనట్లు వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా. ముంపుకు గురైన పంటలకు సంబంధించి విపత్తు సహాయ మార్గదర్శకాలకు అనుగుణంగా 33 శాతం పైగా నష్టపోయిన పంటలను, నాటు పూర్తి చేసి 32 రోజులు దాటిన తర్వాత ముంపుకు గురైన వరి పంటను పరిగణలోకి తీసుకుంటారు. అయితే ప్రాథమిక స్థాయిలో బృందాలు అంచనాలు రూపొందించే క్రమంలో వాస్తవ సాగుదారులను గుర్తించి వారి పేర్లను మాత్రమే నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో బృందాలు వాస్తవాలను గుర్తిస్తే వాస్తంగా పంటలు సాగు చేస్తు వర్షాలకు దెబ్బతిన్న కౌలు రైతులకు ఒకింత ఊరట దొరుకుంది.

కౌలు రైతులకు ఊరట దొరికేనా?

కౌలు రైతులకు నష్టపరిహారం ఇచ్చే క్రమంలో క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డు (సిసిఆర్‌సి)తో పాటు ఈ క్రాప్, ఈ కెవైసిలనే పరిగణనలోకి తీసుకుంటున్నారు. సిసిఆర్‌సి ఉన్నా విపత్తు సమయాల్లో భూ యజమానులు పేర్లనే జాబితాల్లో నమోదు చేయడంతో పంట నష్టపోయిన కౌలు రైతులకు కనీస ఊరట దొరకడం లేదు. క్షేత్రస్థాయిలో ముంపుకు గురై నష్టపోయిన పంటలను గుర్తించే క్రమంలో వాస్తవ సాగుదారుల పేర్లను పరిగణలోకి తీసుకుని ఈకెవైసి, ఈ క్రాప్ చేస్తేనే నష్టపోయిన కౌలు రైతులకు ఒకింత ఊరట దొరకుతుంది. జిల్లాలో అత్యధికంగా 75 శాతం విస్తీర్ణంలోని భూములను కౌలు రైతులు సాగు చేస్తున్నారు. రెండు లక్షల మంది కౌలుపై ఆధారపడి ఉన్నారని అంచనా. ఈ ఏడాది జిల్లాలో 70 వేల (సిసిఆర్‌సి)లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 63 వేలు కార్డులు అందించారు. ఈ క్రమంలో ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేస్తే కొంత మేరకైనా కౌలు రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. దీనికి అనుగుణంగా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి : హరిబాబు

ప్రజాశక్తి-గుడివాడ : ఇటీవల వచ్చిన వరదల వల్ల కృష్ణా జిల్లాలో నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు అన్నారు. గురువారం గుడివాడ పరిసర ప్రాంతాల్లో బుడమేరు పరివాహక ప్రాంతాలయిన పెదపారుపూడి, నందివాడ మండలం జొన్నపాడు గ్రామాల్లో రైతు సంఘం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ప్రధానంగా కష్ణ నది గర్భంలో ఉన్నటువంటి పంటలన్నీ దాదాపు మునిగిపోయిన పరిస్థితి ఉందన్నారు. పెదపారుపూడి మండలంలోని కొన్ని ప్రాంతాలు మొత్తం మునిగిపోయిందని ఇప్పటికే 5,6 రోజులు పాటు నీళ్లలో నానడం వల్ల వరి పంట కూడా పైసా కూడా తిరిగి రైతులు చేతికి రాదన్నారు. ప్రభుత్వం ఉదారంగా స్పందించి ఆ రైతులను ఆదుకోవడానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై నరసింహారావు, సిపిఎం గుడివాడ పట్టణ కార్యదర్శి ఆర్ సి పి రెడ్డి, కష్ణాజిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, గుడివాడ పట్టణ కమిటీ సభ్యులు పి రజిని, ఆర్ కొండ, శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జొన్నపాడులో పంట పొలాలను పరిశీలిస్తున్న నాయకులు నరసింహారావు, హరిబాబు

ఆహారం, మంచినీరు పంపిణీ

వరదలకు గురై సర్వస్వం కోల్పోయిన బాధితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ప్రాంతంలో 50 వేల కుటుంబాలు ప్రత్యక్షంగా, మరో 50 వేల కుటుంబాలు పరోక్షంగా వరద బాధితులుగా మారాయని పేర్కొన్నారు. బాధితులకు మంచినీరు, కొవ్వొత్తులు, మస్కిటో క్యాండిల్స్, దోమతెరలు, తగిన విధంగా ఆహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. నిత్యావసర సరుకులు, కూరగాయలు వెంటనే ఇవ్వాలని కోరారు. గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించాలని కోరారు. ఇప్పటికీ పలువురు జాడ తెలియని పరిస్థితి నెలకొందన్నారు. మరణించిన కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన గహ వినియోగ వస్తువులు, మోటార్ బైక్ రూపంలో ప్రతి కుటుంబానికి రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందన్నారు. వ్యాపారులు, చిన్న పరిశ్రమలు, వత్తిదారులంతా దెబ్బతిన్నారని పేర్కొన్నారు. కృష్ణా జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం (విజయ డెయిరీ) పూర్తిగా నీట మునిగి కోట్లాది రూపాయల మేర నష్టం వాటిల్లిందన్నారు. నగరంలో సామాన్యులే వెయ్యి కోట్లకు పైగా వ్యక్తిగత ఆస్తిని నష్టపోయారని తెలిపారు. బుడమేరు ముంపు నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ కరెంటు లేక దోమలతో తీవ్ర ఇబ్బందులు పడ్డామని,మంచినీరు, ఆహారం అందక ఆకలితో అలమటించామని తమ ఆవేదనను వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సూరిబాబు, రామన్న, ప్రసన్న, రామ్మోహన్, వెంకటేశ్వరరావు, సోమేశ్వరరావు, పి.రాజు, జి.నాగరాజు, వెంకట్రావు, రాము, మహేష్, దుర్గారావు, బాలు, చిట్టి పాల్గొన్నారు.

నేడు ఉచితంగా గణపతి మట్టి విగ్రహాలు పంపిణీ

విజయవాడ: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని విజయవాడ మహాత్మాగాంధీరోడ్డులోని తమ పెట్రోలు బంకులో శుక్రవారం సాయంత్రం మూడు గంటల నుంచి ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని పైలెట్ సర్వీస్ స్టేషన్ పెట్రోలు బంకు మేనేజర్ కె.వెంకటప్పయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏటేటా వినాయక చవితికి ముందురోజున మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. గత 19 సంవత్సరాలుగా పైలెట్ సర్వీస్ స్టేషన్ పెట్రోలు బంకులో వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్నామని యజమాని ఎంవివి సత్యనారాయణ, నందకిశోర్ వివరించారు.

పేరుమార్పు

నేను కురేటి సంకీర్తన, W/o సగ్గుర్తి మహేష్, D/o (లేటు) కురేటి సీతారాములు మరియు (లేటు) కురేటి రమణ. నివాసం : డి.నెం. 8-1291, ఫ్లాట్ నెం. ఎఫ్ఎఫ్-1, సాయికృపా నిలయం, పద్మజ నగర్ 2వ క్రాస్, పుల్లమ్మ కొట్టు ఎదురు, తాడిగడప, కృష్ణాజిల్లా.

వివాహం ముందు నా పేరు కురేటి సంకీర్తన D/o కురేటి సీతారాములు (లేట్), నా వివాహం తర్వాత నా పేరును కురేటి సంకీర్తన నుండి సగ్గుర్తి సంకీర్తన, W/o సగ్గుర్తి మహేష్ గా మార్పు చేయడం జరిగింది. కావున నేటి నుండి నా పేరును సగ్గుర్తి సంకీర్తన W/o సగ్గుర్తి మహేష్ **(SAGGURTHI SANKEERTHANA, W/o SAGGURTHI MAHESH)** గా పిలవ బడును. (ఆధార్‌లో మార్పు కొరకు)

లింక్ డాక్యుమెంట్ పోయినది

తిరువీదుల రాజేష్, తండ్రి : తిరువీధుల చంద్రరావు, 5-4, పెద ఓగిరాల, ఎస్.సి. కాలనీ, వుయ్యూరు మండలం, కృష్ణాజిల్లా, నేను పై నివాసంలో ఉంటున్నాను. నా పేరుతో వున్న ఆస్థికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్‌ను (1096/1963) ఎస్‌ఆర్‌ఓ, ఉయ్యూరు. 23-9-2023 న పెద ఓగిరాల నుండి వుయ్యూరు వెళ్తుండగా పోయినది. పైన తెలిపిన దస్తావేజు ఎవరికైనా దొరికినచో దయచేసి పైన తెలిపిన అడ్రస్‌లో కానీ నా నెంబరులో కానీ సంప్రదించ వలసినదిగా మనవి.

సెల్ నెం : **9666919590**

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE (JUNIOR DIVISION) AT GUDIVADA
O.S. NO. 67/2024

Between :
Medepalli Veera Raghavulu .... Plaintiff
and
Vemuri Nancharaiah, S/o Bhaskara Rao, Railway station Track Man, Railway Quarters, S.C. Railway, Gudivada
...Defendents

పై నెంబరు దావాలో మీకు దావా సమను అమలు నిమిత్తం ది. 30-9-2024కి వాయిదా అయివున్నది. సదరు దావాలో మీకు ఏ విధమైన అక్షేపణలు వున్న యెడల పై వాయిదారోజు పై కోర్టులో ఉదయం 10-30 గం.ల లగాయతు మీరు స్వయంగా గానీ, మీ తరఫున అడ్వకేటుగారి ద్వారా గానీ హాజరయి తెలుపుకొన వలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

వాయిదాతేది : 30-9-2024

టి.శ్రీనివాసులు,
అడ్వకేట్, నోటరీ,
కోర్టుబిల్డింగ్స్ ఎదురు,
గుడివాడ. సెల్ నెం : **9394211742**

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
విజయవాడ బ్రాంచి ఆఫీసులు -
-బోడెమ్మ హోటల్ ప్రక్కన, బి ఆర్ పి రోడ్, 1 టౌన్.
-శ్రీ కృష్ణ నిలయం, బ్యాంక్‌ఆఫ్ బరోడా పైన, ఏలూరు రోడ్డు, గవర్నర్‌పేట.
- జమ్మిచెట్టు సెంటర్, మోడరన్ అకాడమీ కాలేజి ప్రక్కన, మొఘల్‌రాజపురం.
- # 43-144-5, ఫస్ట్‌ఫ్లోర్, పైపులరోడ్డు, రామాలయం గుడి ఎదురు, అజిత్‌సింగ్‌నగర్. ఫోన్ : 9121591614

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-09-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 604.05 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీస్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
VIJAYAWADA AREA CELL NO- **80088 12798**

మహారాజశ్రీ కృష్ణా జిల్లా 15వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, నూజివీడు
ఓ.యస్. నెం. 156/2017

బిట్వీన్:
కొల్లిపర అనిల్‌కుమార్ -వాది
మరియు
కాకరాల లీలా కృష్ణప్రసాద్
మరియు 3 యితరులు
-ప్రతివాదులు

టూ: ప్రతివాదులు నెం-4:
4. ముద్దరబోయిన లక్ష్మి పవంతి, భర్త: శ్రీనివాసరావు, వయస్సు 40 సం॥లు, నివాసం: ఫ్లాట్ నెం. 401, హిల్ వ్యూ రెసిడెన్స్, జయప్రకాష్ నగర్, 2వ లైన్, యల్.ఐ.సి. కాలనీ, విజయవాడ, కృష్ణా జిల్లా, ప్రస్తుతం యన్.టి.ఆర్. జిల్లా.

పై నెంబరు దావాలో ప్రతివాదులు నెం. 4 అయిన మీరు పైన పేర్కొనిన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అగుటకు గానూ **ది. 20-9-2024వ తేదీన వాయిదా వున్నది. సదరు తేదీన ఉదయం 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేదా మీ న్యాయవాది ద్వారా గానీ హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షము నందు తీర్మానించుదురు.

నెక్కళపు మాధవరావు
నూజివీడు న్యాయవాది
ది.03-9-2024 సెల్: 9885641484

IN THE COURT OF THE AGENT TO THE GOVERNEMNT (DISTRICT COLLECTOR) AT KOTHAGUDEM
HMOP NO. 17 OF 2023

BETWEEN:
Ulli Rajeswar Rao ....Petitioner
And
Ulli Devi @Kethepalli Devi
....Respondent

To
Ulli Devi @ Kethepalli Devi, w/o Ulli Rajeswara Rao, D/o late Kethepalli Jagan Mohan Rao and Kanaka Durga, 42 years; c/o Sanka Radha Krishna, Janta theater center, Tiruvur Town and Mandal, NTR District. AP. Cell: 9032032252.

Take notice that the above named petition which is filed to dissolve the marriage between petitioner and respondent by way of Divorce and it is posted to **05-10-2024** for your appearance at **10.30 A.M.** If you fail to appear you shall be set exparte by the Hon'ble court.

(By order of the Hon'ble court)

P.GANESH BABU
SRI RAMULA RAVI
Advocates Kothagudem,
Cell: 9849246278

మహారాజశ్రీ క్రిష్ణాజిల్లా మచిలీపట్నం 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
A.S. No. 13/2024

Between :
కర్రా రూపవతి ..... అప్పెలెంట్
మరియు
కర్రా విజయ & అదర్స్ ..... రెస్పాండెంట్స్
To, రెస్పాండెంట్ 1 to 5 :
R1) కర్రా విజయ W/o. నాగ మల్లేశ్వరరావు, చిన్నశక్తి గుడి రోడ్డు, 3వ ఇల్లు, శిడింబి అగ్రహారం, ఈడేపల్లి, మచిలీపట్నం.
R2) కర్రా సురేష్ S/o. నాగ మల్లేశ్వరరావు, చిన్నశక్తి గుడి రోడ్డు, 3వ ఇల్లు, శిడింబి అగ్రహారం, ఈడేపల్లి, మచిలీపట్నం.
R3) కర్రా దివ్య D/o. నాగ మల్లేశ్వరరావు, చిన్నశక్తి గుడి రోడ్డు, 3వ ఇల్లు, శిడింబి అగ్రహారం, ఈడేపల్లి, మచిలీపట్నం.
R4) కర్రా బసవయ్య S/o. (లేటు) సుందరరావు, డోర్ నెం. 4/19, వాటర్ ట్యాంక్ దగ్గర, వాడగొయ్య గ్రామం, బందరు మండలం, క్రిష్ణాజిల్లా.
R5) పాతపాటి వెంకటేశ్వరమ్మ W/o. అంకినీడు, కొత్తకాలనీ, రుద్రవరం గ్రామం, బందరు మండలం, క్రిష్ణాజిల్లా.

పై నెంబరు అప్పీలులో 1, 2, 3, 4, 5 రెస్పాండెంట్లు అయిన మీ హాజరు నిమిత్తం ది. 25-9-2024నకు వాయిదా అయివున్నది. కావున సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారా గానీ పై కోర్టువారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనియెడల మీ పరోక్షమున తదుపరి గ్రంధములు జరిపించబడునని ఇందుమూలంగా తెలియజేయట మైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా : 25-9-2024

కె.జయభాగ్యరాజ్
అప్పెలెంటు తరఫున న్యాయవాది
మచిలీపట్నం
సెల్ నెం : **9247199991.**

వరద బాధితులకు విరాళాల సేకరణ

గన్నవరంలో...

చల్లపల్లిలో..

బంటుమిల్లిలో పాడైన పంట చూపిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గన్నవరం : విజయవాడలో వరద బాధితుల సహాయార్థం గురువారం గన్నవరంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం సుందరయ్య రెడ్ వాలంటీర్స్ ఆధ్వర్యంలో విరాళాల సేకరించారు. శ్రీనగర్ కాలనీలో విరాళాల తోపాటు వస్తువులు, బట్టలు సేకరించారు. ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది. ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. విరాళాల సేకరణ ద్వారా 25 వేల రూపాయలు వచ్చిందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్ర బాధ్యులు కళ్ళం వెంకటేశ్వరరావు, రెడ్ వాలంటీర్స్ బాధ్యులు మల్లంపల్లి ఆంజనేయులు, రాంబాబు, మిరప నాగేశ్వరరావు, పటాన్ సర్దార్, సాంబశివరావు, తాతాబ్బాయి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** కృష్ణా నది వరద ఉధతి కి నిరాశ్రులై పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందుతున్న వరద బాధితులకు ప్రజాసంఘాల నాయకులు పులిహోర పొట్లాలు, వాటర్ బాటిళ్లు గురువారం పంపిణీ చేశారు. చల్లపల్లి మండలం లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లక్ష్మీపురం, చల్లపల్లి ఉన్నత పరిషత్ పాఠశాలలలో ఆశ్రయం పొందుతున్న వరద బాధితులకు ఏపీ రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో గురువారం పులిహోర, వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కొర్ని అప్పారావు, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ కరీముల్లా, చల్లపల్లి మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి మేడేపల్లి వెంకటేశ్వరరావు, చల్లపల్లి మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లంకపల్లి సత్యనారాయణ, కలపాల దానయ్య, బళ్ళ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

అలాగే ఆముదర్లంక స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో చల్లపల్లి విజయ పబ్లిక్ స్కూల్ లో పని చేస్తున్న ఉపాధ్యాయులు 200 కుటుంబాలకు . రూ. 70 వేలు విలువ చేసే బియ్యం, కందిపప్పు వంటి నిత్యావసర సరుకులను గురువారం అందించారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** ఆకలి దప్పులతో అల్లాడుతున్న వరద బాధితులకు సిపిఎం నేనున్నానని బాసటగా నిలిచింది. గురువారం మోపిదేవి మండల పరిధిలోని కే కొత్తపాలెం కరకట్టపై నిరాశ్రయులుగా ఉన్న వరద బాధితులకు రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కొర్ని అప్పారావు, ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు పంచకర్ల రంగారావు తదితరులు 400 మందికి ఆహార పొట్లాలు మంచినీళ్ల పంపిణీ చేశారు మండల సిపిఎం కార్యదర్శి బండి ఆదిశేషు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి కరిముల్లా, యద్దనపూడి మధు తదితరులు పాల్గొన్నారు **ప్రజాశక్తి-బంటుమిల్లి :** బంటుమిల్లి,కత్తివెన్ను మం డల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సిపిఎం నాయకులు పర్యటించారు. కృత్తివెన్ను మండలం ముని పెడ, ఎండపల్లి, సీతనపల్లి, నీలిపూడి తదితర గ్రామాల్లో పర్యటించారు. నాయకులు మాజేటి శివ శ్రీనివాసరావు, కొల్లాటి శ్రీనివాసరావు స్థానిక కత్తివెన్ను అధికారులను అగ్రికల్చర్ ఏవో జర్నీ ,ఫిషరీస్ మండల అధికారి అంజలిని ఇరిగేషన్ డ్రైనేజీ అధికారులు నాగేశ్వరావుని కలిసి వినతిపత్రం అందించారు.

బాధితులను ఆదుకుంటాం : మంత్రి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గంలోని వరద ప్రభావిత ప్రాంతాలయిన జక్కుల నెక్కలం , ముస్తాబాద, సావారిగూడెం తదితర ప్రాంతాల్లో మంత్రి కొల్లు రవీంద్ర గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి విస్తతంగా పర్యటించారు. రైతులు ముంపు బాధిత ప్రజలను పరామర్శించారు. నీట మునిగి పంట పొలాలను పరిశీలించి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పంట కోల్పోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. **ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** వరద ప్రభావిత ప్రాంతాలైన మచిలీపట్నంలోని 50వ డివిజన్ లోని సుందర్ నగర్, డ్రైవర్స్ కాలనీ, గుమస్తాల కాలనీల్లో మంత్రి కొల్లు రవీంద్ర పర్యటించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, స్థానిక నాయకులు బండి రామకష్ణ, మచిలీపట్నం నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ బాపిరాజు తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

కేంద్ర మంత్రికి స్వాగతం

ప్రజాశక్తి-గన్నవరం : వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు గన్నవరం విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో గురువారం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ వచ్చారు. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ , రాజమండ్రి పార్లమెంటు సభ్యులు దగ్గుబాటి పురంధేశ్వరి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా పోలీసు అధికారి ఆర్. గంగాధర్ రావు ఘనంగా స్వాగతం పలికారు.


గండి చూపుతున్న గ్రామస్తులు

గండి పూడ్చండి మహాప్రభో...

ప్రజాశక్తి-గన్నవరం : బుద్ధవరం పంచాయతీ పరిధిలోని దావాజీగూడెం వద్ద ఏలూరు కాలవకు గండి పడింది. గ్రామస్తులు 150 మంది గండి పూడ్చేందుకు విఫలయతనం చేశారు. ఇసుక బస్తాలు గడ్డి వేసిన వేరొక చోట గండిపడి పొలాలు మునిగిపోతున్నాయి. దళితవాడలోని ఇళ్ళ మీదకు నీరు వచ్చే ప్రమాదం పొంచి ఉంది. ఈ ప్రమాదం నుంచి బయట పడాలంటే తక్షణమే జేసిబి తో మరమతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామ సిపిఎం నాయకులు మరియదాసు మాట్లాడుతూ.. ఏలూరు కాలవ కట్ట బలహీనంగా ఉండడంతో పలుచోట్ల గండ్లు పడుతున్నాయని, జిల్లా కలెక్టర్ స్పందించి కాలవకట్ట బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎంఎల్ఏ పర్యటన

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ మండలంలో వరద ముంపుకు గురైన దక్షిణచిరువాలంక, ఎడ్ల లంక గ్రామాలను ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పరిశీలించారు. గురువారం మండల పరిధిలోని రామచంద్రపురం పాలిటెక్నిక్ కళాశాలలో వరద బాధితుల పునరావాస కేంద్రాన్ని సందర్శించి ఆ శిబిరంలో ఆశ్రయం పొందుతున్న దక్షిణ చిరువోలు లంక వరద బాధితులను బుద్ధ ప్రసాద్ తో పాటు ఆయన తనయుడు నియోజక వర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం కూడా పరామర్శించారు. వారితో మాట్లాడి భరోసా కల్పించారు వారికి అందుతున్న వైద్య ఆహార సదుపాయాలు పరిశీలించారు. అనంతరం చిరువోలు లంక గ్రామం వెళ్లి గ్రామంలోని ఎస్సీ ఎస్టీ కాలనీలను పరిశీలించారు గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలు పరిష్కారం చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం మండల పరిధిలోని ఎడ్ల లంక దీ వి కి వెళ్లి పరిశీలించారు. కష్ణా నదిలో వరద ఉధతంగా ప్రవహిస్తున్న ప్రత్యేక పడవలో ఎడ్ల లంక వెళ్లారు. గ్రామంలో కోతకు గురైన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు మండల పార్టీ అధ్యక్షులు య సం చిట్టిబాబు, జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు, టిడిపి జనసేన నాయకులు పాల్గొన్నారు

మథర్ థెరిస్సాకు నివాళి

ప్రజావక్తి - గుడివాడ : సేవే ధ్యానంగా భావించి పునీతురాలుగా అయిన మథర్‌థెరిస్సాను ప్రతి ఒక్కరూ ఆమె చూపిన సేవా మార్గంలో నడవాలనీ ఫాదర్ గుజ్జుల మైఖేల్ అన్నారు. బుధవారం మథర్‌థెరిస్సా 27వ వర్థంతిని పురస్కరించుకుని స్థానిక ఏలూరురోడ్డులోని మౌంట్ కార్మెల్ (ఆర్‌సిఎం), చర్చి వద్ద గల మథర్ థెరిస్సా విగ్రహానికి ఫాదర్ మైఖేల్, సహాయగురువు శ్రీకాంత్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు ఏలేటి విలియం జోషి, వీరబత్తిన జీవరత్నరాజు, రెబ్బా బాలరాజు, ఇంటి స్వామిదాసు, ఉపదేశికులు తోట క్రీస్తురాజు పాల్గొన్నారు.

దామోదరయ్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

కానూరి దామోదరయ్యకు నివాళి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఉన్నత పాఠశాల స్థాయి నుండి కళాశాల స్థాయికి చేరుకోవడానికి గల కారకులు, వ్యవస్థాపకులు కానూరి దామోదరయ్య 70వ వర్ధంతి కార్యక్రమాన్ని మండలంలోని కవుతరం కానూరి దామోదరయ్య జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు బి వి ఎన్ ఎల్ పద్మావతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఎంతోమంది విద్యార్థిని విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయిలో ఉండటానికి కారణభూతులు దామోదరయ్యా అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కంచర్ల ప్రకాష్,, వైస్ ప్రెసిడెంట్ జంపాన సుధారాణి, గ్రామ ప్రముఖులు, ఉపాధ్యాయులు పద్మావతి, మనోహర్ , విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ మృతికి తులసీరావు సంతాపం

ప్రజాశక్తి - విజయవాడ : సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకలు రుద్రరాజు సత్యనారాయణ (ఆర్ఎస్) మృతికి విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు, పార్టీ సీనియర్ నాయకులు బి.ఆర్.తులసీరావు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆర్ఎస్‌తో తనకున్న అనుబంధాన్ని తులసీరావు గుర్తుచేసుకున్నారు. ఆర్ఎస్, తాను ఒకే సమయంలో ఉమ్మడి కృష్ణ, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల కార్యదర్శులుగా ఉన్నామని, ఆ సమయంలో ఆర్ఎస్ నుండి తాను ఎంతో నేర్చుకున్నారని తులసీరావు పేర్కొన్నారు. ఆర్ఎస్‌తో కలిసి పనిచేయడం గర్వకారణంగా ఉందని తెలిపారు.

సరుకులు అందజేత

ప్రజాశక్తి-అవనిగడ్డ : వరద శిబిరం నుంచి పంపించి వేయడంతో దిక్కు తోచని స్థితిలో ఉన్న దక్షిణ చిరు ఓలులంక గ్రామానికి చెందిన ఎస్టీలను ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కు ర్తి శ్రీనివాస్ ఆదుకున్నారు. గురువారం ఆ ప్రాంతాన్ని పరిశీలించేందుకు వెళ్లిన ఎస్టీలను శ్రీనివాస్ పలకరించగా వారంతా శ్రీనివాసు ముందు తమ గోడు వెళ్ళబోసుకున్నారు. వండుకునేందుకు ఏమీ లేవని, తమని ఆదుకోవాలని కోరగా వెంటనే స్పందించి బియ్యం కందిపప్పు సరుకులు అందజేశారు. పంచాయతీ రక్షత మంచినీటి పథకం మోటర్లు వరదలకు దెబ్బతినగా వాటిని తాను బాగు చేయిస్తానని శ్రీనివాస్ హామీ ఇచ్చారు.**ప్రజాశక్తి-కోడూరు :** కోడూరు మండల పరిధిలోని హరిపురం వద్ద లింగన్న కోడు లాకులు సమీపంలో నివసిస్తూ పునరావాస కేంద్రాలకు వెళ్ళని ఎస్టీలకు ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ గురువారం భోజనాలు సమకూర్చారు. తమను పునరావాస శిబిరం నుంచి పంపి వేశారని ఎస్టీలు తెలపడంతో భోజనాలు తెప్పించి యానాది సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మంగళగిరి శ్రీనివాసరావు ద్వారా అందచేసారు.

చిక్కవరం ఎస్‌సి కాలనీ మునక

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం చిక్కవరం ఎస్సీ కాలనీ లోకి భారీగా వరద నీరు చేరింది. ఇళ్ళు లో పూర్తిగా వరద నీరు మయంగా మారింది. డ్రైనేజీలు లేక ఇళ్లల్లోకి, రోడ్లమీద కు నీరు వచ్చింది. బ్రహ్మ లింగయ్య చెరువు నుంచి భారీగా వరద నీరు రావడంతో చిక్కవరం ఎస్సీ కాలనీ గ్రామస్తులు భయ పడు తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- సిపిఎం, రైతు సంఘాల నేతలు

పెదపారుపూడి మండలంలో..

తోట్లవల్లూరులో...

ప్రజాశకి‌్త-పెదపారుపూడి : మండలంలోని మోపర్రు, దోసపాడు, వింజనంపాడులలో భారీ వర్షాలకు ముంపుకు గురైన కౌలు రైతు సంఘరాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు, సిపిఎం నాయకులు ఓ గంగాధర ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈసందర్భ హరిబాబు మాట్లాడుతూ వరదకు వేలాది ఎకరాలు పంట నీటి పాలైందని, ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారం అందించాలన్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** మండలంలోని తోట్ల వల్లూరు, వల్లూరు పాలెం, భద్రిరాజుపాలెం, దేవరపల్లి గ్రామాల్లో పునరావాస కేంద్రాల్లో ఉన్న వరద బాధితులకు 1500 పులిహోర ప్యాకెట్లు ఏలూరు జిల్లా రైతు, కౌలు రైతు సంఘాల సహకారంతో అందించారు. వరుణ్ కార్డియాలజీ సెంటర్ విజయవాడ వారి సహకారంతో వాటర్ బాటిల్స్ ని అందించారు. రైతు సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కే.శ్రీనివాసరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు, జిల్లా రైతు సంఘం నాయకులు గుత్తికొండ వెంకటకష్ణారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కోసూరి శివ నాగేంద్రం, కంకిపాడు మండల కార్యదర్శి టి. నరేష్, సిపిఎం నాయకులు లెనిన్ ,రాంబాబు పులిహోర, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు.

వరద వేదన

ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణాజిల్లా
శుక్రవారం
6 సెప్టెంబర్ 2024

గన్నవరం మండలం కేసరపల్లిలో వరద పరిశీలిస్తున్న చంద్రబాబు

గన్నవరం మండలంలో పాడైన పంటను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

జగ్గయ్యపేటలో పంటలు పరిశీలిస్తున్న నాయకులు

కంచికచర్లలో కూరగాయలు వితరణ చేస్తున్న దృశ్యం

బందరులోనీట మునిగిన ప్రాంతాలు పరిశీలిస్తున్న మంత్రి కొల్లు

విజయవాడలో రోడ్లపై కట్టి వేసిన పశువులు

విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో ఆహార పదార్థాలతో వాహనాలు

విజయవాడలో మంచినీటి కోసం ఇబ్బందులు

విజయవాడలో అపార్ట్‌మెంట్ల వద్ద తగ్గని వరద నీరు

విజయవాడలో రాజరాజేశ్వరిప్రాంతంలో రోడ్లపై వరద నీరు

ప్రకాశం బ్యారేజీని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

విజయవాడలో బుడమేరు వాగును పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

విజయవాడలో శివారులో ఇంకా వరద నీటిలోనే ఇళ్లు

విజయవాడలో ట్రాక్టర్లపై సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్న వరద బాధితులు

విజయవాడలో ఇంటి పరిసరాలు శుభ్రం చేసుకుంటున్న స్థానికులు

విజయవాడలో వరద నీటిలో చెక్కపై ప్రయాణిస్తున్న బాధితులు

విజయవాడలో వరద నీటిలో వెళ్తున్న బాధితులు

వరద నీటిలోనే వన్‌టౌన్‌లోని విజయ డెయిరీ కంపెనీ

విజయవాడలో వరద నీటిలోచిన్నారి నడక

విజయవాడలో వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ జల్లుతున్న కార్మికులు

చనిపోయిన పశువులు

గుడివాడ మండలంలో నీట మునిగిన పంటపొలాలు

గుడివాడలో వరద నీటిలోనే ఇళ్లు

మోపిదేవి మండలంలో పాడైన కూరగాయల పంటలు

చందర్లపాడు మండలంలో పాడైన పంటలు పరిశీలిస్తున్న నాయకులు

గన్నవరం మండలంలో వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రి కొల్లు

మైలవరం మండలంలో రోడ్లపై ప్రవహిస్తున్న వరద నీరు

వన్‌టౌన్‌లో కొండచరియలు విరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సత్యబాబు

వన్‌టౌన్‌లో ఆహారం అందిస్తున్న దృశ్యం

పమిడిముక్కల మండలంలో గుర్రాలలంక నుంచి ఆహారం పంపిణీ

పెనుగంచిప్రోలులో పంటలు పరిశీలిస్తున్న వైసిపి నాయకులు

వత్సవాయి మండలంలో పాడైన వాణిజ్యపంటలు

నిత్యావసర సరుకులు అందజేత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వరద ప్రభావానికి గురైన రెడ్డి నాయక్ తండ గ్రామంలో స్థానిక విజ్ఞాన్ స్కూల్ స్టాఫ్ సందర్శించి స్కూల్ యాజమాన్యం సహకారంతో తయారు చేయబడిన నిత్యావసర సరుకులను ఒక కిట్‌గా తయారు చేసి వరద ముంపునకు గురైన గృహాలను సందర్శించి గృహానికో కిట్ పంపిణీ చేశారు. బియ్యం, కందిపప్పు, పంచదార, టీ పొడి, ఉప్మారవ్వ, సన్ ఫ్లవర్ నూనె ప్యాకెట్, చింతపండు, సబ్బులు, బట్టలు సబ్బులు, మస్కిటో కాయిల్స్, కొబ్బరి నూనె తదితర సరుకులతో కూడిన కిట్ ఇచ్చారు. ఆపదలో ఆదుకున్న విజ్ఞాన్ స్కూల్ వారి యాజమానానికి, స్టాఫ్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: వరద బాధితుల సహాయార్థం పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని స్థానిక శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అన్నారు. గురువారం కాకాని నగర్‌లోని ట్రస్ట్ ఆవరణలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఆయన బాధితులకు నిత్యావసర వస్తువులు, దుప్పట్లు పంపిణీ చేశారు. వరద కారణంగా ఇల్లు కూలిపోయిన పోతులూరి లక్ష్మి, కావటి లక్ష్మీలకు తక్షణ సహాయంగా రూ.10 వేలు అందించినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. కర్లపాటి లక్ష్మీ ప్రవంతి – సమీర్ కుమార్, లక్ష్మీదీపక్ – పూజ దంపతుల ద్రవ్య సహాయంతో షుమారు 100 కుటుంబాలకు పంపిణీ చేసినట్లుగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్‌రావు, నాయకులు మైనేని రాధా, బాలకృష్ణ, రాయపూడి వెంకటేశ్వరరావు, ట్రస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిస్కెట్ ప్యాకెట్లు అందజేత

జగ్గయ్యపేట : వరద బాధిత ప్రజలను ఆదుకోవాలని ఎంఎల్‌ఎ శ్రీరామ్ తాతయ్య పిలుపుతో స్పందించి వరద ప్రాంత ప్రజలకు పంచడానికి 900 గుడ్ డే బిస్కెట్ ప్యాకెట్లను గురువారం పట్టణంలోని ఎంఎల్‌ఎ కార్యాలయంలో జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్‌కు గుడ్‌విల్ పంపిణీదారులు డోగుపర్తి హనుమంతరావు, డోగుపర్తి సందీప్ అందజేశారు. ఈ కార్యక్రమంలో తూములూరి అశోక్, సురా సతీష్, పితాని శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత ప్రాంతాల్లో రఘురాం పర్యటన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని బుదవాడ గ్రామంలో వరదలకు నష్టపోయిన ఇళ్లను ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం రఘురాం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. పాలేటి నది ఉధృతంగా ప్రవహించడం వల్ల ఊరిలోకి నీళ్ల చేరడం వల్ల 15 ఇళ్లు పూర్తిగా, 450 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, పూర్తిగా దెబ్బతిన్న ఇళ్ల బాధితులను పరామర్శించి భవిష్యత్తులో పక్కగా ఇల్లు ప్రభుత్వం చంద్రబాబునాయుడు నిర్మించి ఇస్తారని బాధితులకు భరోసా ఇచ్చారు. వరదల్లో చిక్కుకున్న వారికి ఇప్పటి వరకు అల్ట్రాటెక్ సిమెంట్ వారు ఆహారాన్ని అందించారని ఇక నుంచి ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహశీల్దార్‌కి సూచించారు. మహిళలు తమకు జరిగిన నష్టం గురించి రఘురామ్‌కి చెప్పుకుంటూ కన్నీటిపర్యంతమయ్యారు.

విధిగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - కంచికచర్ల : పంచాయతీ కార్యదర్శులు తమ గ్రామపంచాయతీలలో అందుబాటులో వున్న సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేపట్టడంతో పాటు వరదలపట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని ఇఒ(పిఆర్‌ఆర్‌డి) శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కలెక్టర్, డీపీఓ ఆదేశాల ప్రకారం కార్యదర్శులు గ్రామ పంచాయతీల్లో లోతట్టు ప్రాంతాలు గుర్తించి నిలిచి ఉన్న వర్షపు నీటిని మోటార్స్ సహాయంతో తొలగించాలన్నారు. వర్షానికి తడిచి, నానిపోయి ఉన్న ఇంటి కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, మంచి నీళ్లు కలుషితం కాకుండా పైపులైన్ లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేయాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంక్ క్లోరినేషన్ చేయించాలని, అంటు వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్, సున్నం చల్లించాలని అన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య సూచన మేరకు నందిగామ పట్టణంలోని బాబు జగజీవన్ హాల్‌లో ఖమ్మం వాస్తవ్యులు అమరనేని మన్మధరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో వరద బాధితులకు రెండు లక్షల 50 వేలు విలువ గల సరుకులను 200 మందికి పంపిణీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ ఎమ్మెల్సీ డాక్టర్ అమ్మినేని రామకృష్ణ, ఆర్డీవో రవీంద్రరావు, సీఐ వైవిఎల్ నాయుడు, తహశీల్దార్ సురేష్, కమిషనర్ రమణబాబు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో ఎంఎల్‌ఎ తాతయ్య పర్యటన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట:

గడిచిన ఇన్ని సంవత్సరాలలో ఇలాంటి విపత్తును ఎన్నడూ చూడలేదని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అన్నారు. మండలంలోని తక్కెళ్ళపాడు, అన్నవరం, బలుసుపాడు, గ్రామాల్లో పాలేరు వరద వల్ల నష్టపోయిన గహాలను, వ్యవసాయ భూములను తాతయ్య, రైతులు, అధికారులు, ప్రజలతో కలిసి పరిశీలించారు. పాలేటి నది సమీపంలో ఉన్న గ్రామాన్ని వరద ముంచెత్తినట్లు ప్రజలు తాతయ్య దృష్టికి తీసుకొచ్చారు. తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన పాలేటి ఒడ్డున ఏర్పాటుచేసిన సుమారు 100 మోటార్లు వరదకు కొట్టుకొనిపోయినట్లు తెలిపారు. పాలేటి నదిని ఆనుకొని ఉన్న వ్యవసాయ భూములు అన్నీ వరదకు ఇసుక, మట్టి వంటివి మాటేసినట్లు దీంతో రైతులు తీవ్ర నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని రహదారులు, గహాలు పూర్తిగా ధ్వంసం అయినట్లు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ శాఖ సంబంధించిన స్తంభాలు పూర్తిగా వరదగా కొట్టుకోవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడిందన్నారు. పాలేటి వరద వల్ల నష్టపోయిన రైతులను, ప్రజలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకుంటుందని వారికి ఆయన హామీ ఇచ్చారు. నష్టపోయిన ప్రతి ఒక్కరి వివరాలను సేకరించాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు సంఘం అధికార ప్రతినిధి కొఠారు సత్యనారాయణ ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా వెంకట నరసింహారావు, నియోజకవర్గ తెలుగు రైతు సంఘం అధ్యక్షులు కానూరి కిషోర్, నీటి సంఘం మాజీ అధ్యక్షులు యానాల గోపీచంద్, సర్పంచ్ కసుకుర్తి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ నీరు తాగొద్దు : విఎంసి కమిషనర్

ప్రజాశక్తి -విజయవాడ :

విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఉదయం వరద ప్రభావిత ప్రాంతాల్లో విజయవాడ నగరపాలక సంస్థ వారు పైపులైన్ ద్వారా సరఫరా చేస్తున్న నీటిని కేవలం వాడుకునేందుకు మాత్రమే ఉపయోగించాలని కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ కబేలా, ఊర్మిళ నగర్, ఐరన్ యార్డ్, నైజాం గేట్, పాత రాజరాజేశ్వరి పేట, కంసాలిపేట, కొత్త రాజరాజేశ్వరి పేట, నందమూరి నగర్, ఇంద్ర నాయక్ నగర్, సింగ్‌నగర్, రాజీవ్ నగర్, కండ్రిక, ఎంఎస్‌సి బోస్ నగర్ పరిసర ప్రాంత ప్రజలందరూ పైప్‌లైన్ ద్వారా సరఫరా అవుతున్న నీటిని కేవలం వాడుటకు మాత్రమే వినియోగించాలని, ఈ నీటిని తాగేందుకు వినియోగించవద్దని ప్రజలకు విన్నవించారు. పైప్‌లైన్ ద్వారా సరఫరా చేస్తున్న నీళ్లను తాగుటానికి వాడొద్దని, వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలందరికీ తాగునీరు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారని, ప్రజలు ట్యాంకర్ ద్వారా సరఫరా చేయబడుతున్న తాగునీటినే తాగటానికి వినియోగించాలని అన్నారు.

బుడమేరు వరద బాధితులకు సిపిఎం విరాళాల సేకరణ

ప్రజాశక్తి - ఎ.కొండూరు : గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరదలు సంభవించి విజయవాడలోని పలు ప్రాంతాలు వరద ముంపుకి గురై అక్కడ ప్రజలు గుక్కెడు నీళ్ల కూడా దొరక్క, తినడానికి ఆహారం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా వహించి తమ వంతు విరాళాలను అందజేయాలని మండల సిపిఎం నాయకులు పి.ఆనందరావు, పి.వెంకటేశ్వరరావు కోరారు. గురువారం సిపిఎం రాష్ట్రకమిటీ పిలుపుమేరకు సిపిఎం నాయకులు కంభంపాడు గ్రామంలో మెయిన్ సెంటర్లో షాపు షాపుకు తిరిగి రూ.10,040 విరాళాలు సేకరించారు. సేకరించిన నగదును రాష్ట్ర పార్టీకి అంద చేయనున్నట్లు వారిద్వారా వరద బాధితులకు అందచేయనున్నట్లు ఆనందరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కంభంపాడు గ్రామ కార్యదర్శి ఆర్.రామకృష్ణ, జములయ్య, బి.చెన్నకేశవులు, పి.వెంకట నవీన్ ఆర్.రామ్, తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక డ్రయిన్ల తవ్వకానికి చర్యలు

ప్రజాశక్తి - తిరువూరు : వారం రోజులుగా తిరువూరు పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాలతో ఎక్కడికక్కడ నిలిచిపోయిన వర్షపు నీటి మళ్లింపునకు నగర పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణంలోని పలు నివాస ప్రాంతాల్లో, శివారు కాలనీలో వర్షపు నీటితో పాటు మురుగునీరు నిలిచిపోయి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండటంతో కచ్చా డ్రయిన్లు తవ్విస్తున్నారు. ఖాళీ స్థలాల్లో సైతం నిలిచిపోయిన వర్షపు నీరు తొలగింపునకు స్థానికులు కోరిన మేరకు గురువారం 8, 12, 14వ వార్డుల్లోని పలు వీధుల్లో జేసీబీతో డ్రయిన్లు తవ్వి నీటిని ప్రధాన డ్రైన్లోకి మళ్లించారు. లోతట్టు ప్రాంతాల్లోని నీటిని ఆయిల్ ఇంజన్లతో తోడి డ్రైనేజీల్లోకి పంపుతున్నారు. 8వ వార్డులో కౌన్సిలర్ నాళ్ల సురేంద్ర దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. నగర పంచాయతీ కమిషనర్ జి.లోవరాజు , సెక్రటరీలు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య ఆదేశాల మేరకు ఇటీవల అకాల వర్షాలు వరదల వల్ల నందిగామ నుండి చందర్లపాడు వెళ్ళు రహదారిలో (వయా చందాపురం నల్లవాగు ఉధృతికి పూర్తిగా పాడైపోయిన) రోడ్డును మరమ్మత్తు పనులను వేగవంతంగా చేశారు. నేషనల్ హైవే 65 నుండి, కంచల గ్రామం వెళ్లే ఆర్ అండ్ బి రహదారి మునేటి వరదకు పెద్ద పెద్ద గండ్లు పడి రాకపోకలు ఇబ్బంది కలిగాయి. ప్రయాణికులు,వాహనదారుల సౌకర్యార్థం తంగిరాల సౌమ్య ఆదేశానుసారం రోడ్డు మరమ్మతు పనులను చేపట్టామని కూటమినేతలు తెలిపారు.

భోజనం పంపిణీ

ప్రజాశక్తి - నందిగామ : పట్టణంలోని బాబూ జగజీవన్ రామ్ కళ్యాణ మంటపంలో వరద బాధితులుగా నిరాశ్రయులైన షుమారు 300 మందికి భోజనం పంపిణీ అన్నపూర్ణ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్‌డిఒ రవీంద్రరావు, తహశీల్దార్ నూతక్కి సురేష్ బాబు, అన్నపూర్ణ సేవాసమితి అధ్యక్షుడు పారేపల్లి సాయిబాబు, ఆర్‌వి వేణుకుమారి, టిడిపి నాయకులు వడ్డెల్లి సాంబశివరావు, మనబోతు శ్రీరామ్,మారం అమరయ్య, దోనర్స్ మొరిశెట్టి కష్ణ చైతన్య, ఈదా వెంకటరెడ్డి, షేక్ సైదా,ధనాలకోట వెంకట్, భోజనం బండి డ్రైవర్ నాగరాజు, దిలీప్, సాయి తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని ఆదుకోండి : వరద బాధితులు

ప్రజాశక్తి - విజయవాడ : బుడమేరు వరద సింగ్‌నగర్‌ను ముంచెత్తింది. 30 వేల కుటుంబాలు సర్వం కోల్పోయాయి. ఇళ్లలోని సామానులు మొత్తం వరద పాలయింది. సర్వం కల్పోయిన బాధిత ప్రజల వారి మాటల్లోనే...

కమ్యూనిస్టులు అధికారంలో ఉంటే ముంపు తప్పేది : శివప్రసాద్

కమ్యూనిస్టులు అధికారంలో ఉంటే సింగ్‌నగర్ ప్రజలకు ఈ ఇబ్బందులు వచ్చేవి కావు. వాళ్ళ ప్రాణాలను సైతం అడ్డుపెట్టి బుడమేరు కట్ట కాపాడి... వరదను కొంత వరకు నిలువరించే వారు. కిరాణా కొట్టు మొత్తం దెబ్బతిన్నది. నా జీవితంలో ఇటువంటి ఉపద్రవాన్ని ఎన్నడూ చూడలేదు. తమ కిరాణాకొట్లో ఉన్న సరుకులు మొత్తం నీటిపాలయ్యాయి.

రూ.రెండు లక్షలు నష్టం: భవాని, వాంబేకాలనీ

కూలి చేసుకొని జీవించే వారం. ఈ వరద వలన సర్వం కోల్పోయాం. తన జీవితంలో ఇటువంటి వరద ఎన్నడూ చూడలేదు. దాతలు ఇస్తున్న భోజనం ప్యాకెట్లు అందరికీ అందడం లేదు. సందుల్లోకి రావడం లేదు. పస్తులుండాల్సి వస్తోంది. మొదటి రెండు రోజులు ఇళ్లు మొత్తం మునిగిపోయాయి.

ఐదు నిమిషాల్లోనే ఇల్లు మునిగిపోయింది : కిషోర్‌కుమార్, ప్రకాష్‌నగర్

కేవలం ఐదు నిమిషాల్లోనే ఇల్లు మొత్తం మునిగిపోయింది. ఇంట్లోని ఫ్రిజ్, టివి, బీరువా, వంట సామాన్లు మొత్తం వరద నీటిలో దెబ్బతిన్నాయి. పని పోయింది. కుటుంబం ఇబ్బందుల్లో ఉంది. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి.

ఇంట్లో అన్నీ వరదపాలయ్యాయి: బి నాగరాజు, టైల్స్ వర్క్, గంగానమ్మగుడి సెంటర్...

వరదకు ఇంట్లో ఉన్న సామానులన్నీ దెబ్బతిన్నాయి. రూ.1.20 లక్షల విలువ చేసే కొత్త బైక్ నీటిలో దెబ్బతిని పనికిరాకుండా పోయింది. ఫ్రిజ్, ఫ్యాన్లు, టేబుల్స్, ఇంట్లో ఉన్న సమానులు మొత్తం నీటిపాలయింది. రూ. రెండు నుంచి మూడు లక్షల వరకు నష్టం జరిగింది.

పంట పొలాలు పరిశీలన

ప్రజాశక్తి - వత్సవాయి : మండలంలోని తాళ్లూరు, మాచినేనిపాలెం, తదితర గ్రామాల్లో పంట పొలాలను స్థానిక స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య పరిశీలించారు. నష్టపోయిన ప్రతి రైతుని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అధికారులతో సమగ్ర సర్వే చేసి నష్టపోయిన రైతులందరినీ గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం నుండి నష్టపరిహారాన్ని అందించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ద్వారా నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతామని అన్నారు.

ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

జగ్గయ్యపేట: పట్టణంలోని టీచర్స్ కో ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో గురువారం భారత రత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా సహాధ్యక్షులు యం క్రిష్టయ్య, జిల్లా కార్యదర్శి జె. సుధానంద్, యు టి ఎఫ్ సీనియర్ నాయకులు మనిమాల రమణ, చిరుమామిళ్ళ సీతారాంబాబు లు రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా సహాధ్యక్షులు ఎం.కృష్ణయ్య మాట్లాడుతూ సాధారణ స్థాయి నుంచి అంచలంచెలుగా ఎదుగుతూ రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ఆదర్శప్రాయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కష్ణయ్య, సుధానంద్, పల్లవి, మూర్తి, నరసింహారావు ప్రసాద్ బాబు, ముక్తేశ్వరరావు, విద్యాసాగర్, నాగుల్ మీరా, గంగాధరరావు, విజయలక్ష్మి, జయసుధ, టీవీ సుజాత, సాయి శ్రీనివాసరావు, వెంకటరత్నం, రంగాచార్యులు పాల్గొన్నారు.

ఆహారం పంపిణీ

ప్రజాశక్తి - విస్సన్నపేట : మండల తహశీల్దార్ కె.లక్ష్మి కళ్యాణి సమక్షంలో అప్పికట్ల కుమార్ ఆధ్వర్యంలో 'మాదిగ పేద విద్యార్థుల సహాయ సంఘం, ఉద్యోగుల సహకారంతో' విస్సన్నపేట వారిచే విజయవాడలో వరద బాధితులకు పులిహోర ప్యాకెట్స్, పాలు, బిస్కెట్స్, వాటర్ బాటిల్స్, కొవ్వొత్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అప్పికట్ల కుమార్, తహశీల్దార్ లక్ష్మీ కళ్యాణి మాట్లాడుతూ ఇలాంటి సమయంలో సహాయ సంఘాలు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటి ధనరాజు, రంగా మాస్టర్, మేకపాం ఆధామ్, లామ్ చార్లెస్, లైన్‌మెన్ సుధాకర్, మేకపాం రవీంద్ర, ఫిరోజ్, సోని నెట్ నాగమల్లేశ్వరరావు, మండల ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కూలిన ఇల్లు

ప్రజాశక్తి - ఎ.కొండూరు : వర్షాలకు మట్టి గోడలు నానటంతో తాటాకు ఇల్లు కూలిన సంఘటన మండలంలోని కంభంపాడులో గురువారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం కంభంపాడులో ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న బుడపుల మల్లయ్య తాటాకు ఇల్లు వర్షానికి నాని కుటుంబ సభ్యులు ఇంటిలో ఉండగానే గోడలు పడిపోవడంతో ఇల్లు కూలింది. ప్రాణహాని జరగలేదు. ఇంట్లోని సామాగ్రి ధ్వంసమైనట్లు బాధితుడు మల్లయ్య తెలిపాడు. నిరాశ్రయులైన తమను ప్రభుత్వం ఆదుకోవాలని, నిత్యావసర సరుకులు అందించాలని బాధితుడు విజ్ఞప్తి చేస్తున్నాడు.

దెబ్బతిన్న పత్తి పొలాలు

ప్రజాశక్తి - వత్సవాయి : వర్షాలకు పత్తి పొలాలు వందు పట్టిపోయాయి. పచ్చగా ఉండాల్సిన ఆకులు నల్లగా మారిపోయాయి. పూత, పిందె దశలో ఉండటంతో అకాల వర్షాలకు పత్తి పొలాలు వేరు కుళ్ళు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రైతులు పేర్కొన్నారు. ఇప్పటికే పత్తి పంట చేతికొచ్చే పరిస్థితి లేకుండా పోయిందంటున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

రైతు, కౌలురైతు సంఘాల నేతలు

ప్రజాశక్తి - చందర్లపాడు : మండలంలోని తోటరావులపాడు, చింతలపాడు, కొడవటికల్లు, కొండ పేట గ్రామాల్లో గురువారం రైతు కౌలు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అధిక వర్షాల వలన నీట మునిగిన పంట పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రకృతి విపత్తును రాష్ట్ర ప్రభుత్వాలు వాతావరణ శాఖను డ్రెయినేజీ వ్యవస్థను స్ట్రీమ్ లైన్‌చేసి ముందుగా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రకృతి విపత్తు వలన నష్టపోయిన పంటని ఎన్యుమరేషన్ చేసి రైతులు తాలూకా వాస్తవ పంట నష్టాన్ని అధికారులు అంచనా వేయాలన్నారు. పంట నష్టాన్ని అంచనా వేసేటప్పుడు రైతులు, కౌలు రైతులను రైతులను భాగస్వామ్యం చేయాలన్నారు. పంట నష్టాన్ని అంచనా లిస్టును సచివాలయాల్లో డిస్‌ప్లే ఉంచాలన్నారు. జిల్లా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు, వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రధానంగా వ్యవసాయ రంగంలో నష్టం వాటిల్లిందని దీనివల్ల వ్యవసాయ కార్మికులు 240 పనిదినాలను కోల్పోయారన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం చందర్లపాడు మండల కార్యదర్శి గుమ్మళ్ళ ఏడుకొండలు, రైతు సంఘం నాయకులు మన్నేపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు, వరదలతో నష్టపోయిన రాష్ట్రాన్ని ఆదుకోవాలి : ఎంపి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : అకాల వర్షాలు, వరదలతో సర్వస్వం కోల్పోయిన ఆంధ్రప్రదేశ్‌ని కేంద్రం ప్రభుత్వం ఆదుకోవాలని, అదేవిధంగా లోక్ సభ, రాజ్య సభ సభ్యులు అందరూ వారి నిధులు కేటాయించాలని మచిలీపట్నం ఎంపీ బాలశౌరి కోరారు. ఏపీలో సంభవించిన విపత్తుపై గురువారం ఈ మేరకు గురువారం ఎంపీ కార్యాలయం నుంచి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇటీవల ఏపీలో సంభవించిన వరదలు, ఆకాల వర్షాల వల్ల ఆంధ్రప్రదేశకు కలిగిన నష్టం భారీగా ఉందని, దీనిని ప్రకతి విపత్తుగా ప్రకటించి కేంద్రం, లోక్ సభ, రాజ్యసభలోని ఎంపీలంతా ఆర్థిక సహకారం అందించాలంటూ విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ, లోక్ సభ స్పీకర్ ఓంబిర్లా, ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్కు ఎంపీ వేర్వేరుగా లేఖలు రాశారు.

ఎర్ర చెరువుతో పొంచి ఉన్న ముప్పు

భయాందోళనలో తారకరామా నగర్ వాసులు

ప్రజాశక్తి - మైలవరం : మైలవరం పొందుగల గ్రామాల మధ్య ఉన్న ఎర్ర చెరువుకు గురువారం గండ్లు పడటంతో మైలవరంలోని తారకరామా నగర్ కాలనీ (దేవుని చెరువు) వాసులు భయాందోళనలకు గురవుతున్నారు. ఆగస్టు 31న కురిసిన వర్షంతో ఎర్ర చెరువు పొంగిపొర్లి కాలువ కట్ట తెగటంతో దేవుని చెరువును ముంచెత్తింది. మరల ఎర్ర చెరువుకు గండ్లు పడుతున్నాయని తెలియడంతో దేవుని చెరువు వాసులు ఆందోళనలో బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. బుధవారం రాత్రి వర్షం పడటంతో ఎర్రచెరువుకు గండ్లుపడ్డాయి. దీంతో చెరువు కట్ట తెగుతుందని గ్రహించిన స్థానిక రైతులు అధికారులకు, టిడిపి నాయకులకు తెలిపారు. ఎసిపి మురళీమోహన్, సిఐ దాడి చంద్రశేఖర్, తహశీల్దార్ జి.బాలకృష్ణ రెడ్డి, స్థానిక టిడిపి నాయకులు బొందలపాటి సుధాకర్, లంక లితీష్, చారు గుండ్ల ప్రసాద్ తదితరులు పొక్లెయిన్ సహాయంతో ముందుగా కలంగిని పగలగొట్టి, గండి పెట్టారు. వరద ప్రవాహాన్ని పురగుట్ట వైపు మళ్ళించారు. ఒకచోట పడిన గండిని పూడ్చే లోపు మరోచోట గండి పడుతుంది. మరల వర్షం పడినా, వరద వచ్చినా ఎర్ర చెరువు తెగుతుందనే పుకార్లు షికార్లు చేయటంతో ఆందోళనలో తారకరామవాసులు ఉన్నారు.

అప్రమత్తం చేసిన అధికారులు

ఎర్ర చెరువుకు గండ్లు పడటంతో చెరువు కట్ట తెగకుండా ఉండేందుకు అధికారులు కళంగినీ పగలగొట్టి గండి పెట్టారు. దీంతో ఎర్ర చెరువు వరద పూర గుట్టవైపు వెళుతుంది. ఈ వరద వల్ల లోతట్టు ప్రాంతాలైన జి.కొండూరు మండలంలోని గుర్రాజుపాలెం, కుంటముక్కల, మైలవరంలోని దేవుని చెరువు వాసులను అప్రమత్తం చేశారు. మండలంలోని గణపవరం గ్రామంలో ఉన్న చెరువుకు కలంగి ఉధృత ప్రవాహంతో గండిపడింది. ఆ వరద దాటికి సమీపంలోని ప్రభుత్వ పాఠశాల గోడ కూలింది. తాత్కాలికంగా ఇసుక బస్తాలు అడ్డుపెట్టారు. బుధవారం రాత్రి పడిన వర్షానికి మరల వరద ప్రవాహం రావడంతో కలంగి వద్ద గండిపడి ఆ ప్రవాహం ప్రధాన రహదారి పైకి చేరుకుంది. దీంతో రాకపోకలు స్తంభించాయి. గండిని పూడ్చే ప్రయత్నం చేస్తున్నప్పటికీ వరద ఉధృతంగా రావడంతో గండి వద్దకు వెళ్లే అవకాశం లేదని, వరద నెట్టి వేస్తుందని స్థానికులు తెలిపారు.

వరద బాధితులకు సాయం

ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా): వరద బాధితుల సహాయార్థం రూ.3 లక్షలు విరాళం అందించేందుకు పాఠశాల విద్యార్థులు, యాజమాన్యం ముందుకు రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. గురువారం నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో కానూరుకు చెందిన షామిరాక్ ఇంటర్నేషనల్ పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు కలిసికట్టుగా 3 లక్షల రూపాయల బ్యాంకు చెక్కును కలెక్టర్కు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సుమన్ త్యాగరాజ్ జిల్లా కలెక్టర్ కు వివరిస్తూ తమ పాఠశాల విద్యార్థులు చేనేత వస్త్రాలు, కూరగాయలు విక్రయించడం ద్వారా తమ తల్లిదండ్రుల దగ్గర నుండి సేకరించిన ఒక లక్ష రూపాయల మొత్తానికి పాఠశాల యాజమాన్యం మరో 2 లక్షల రూపాయలు జోడించి మొత్తం మూడు లక్షల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం జిల్లా కలెక్టర్ కు అందజేస్తున్నామన్నారు. పాఠశాల అధ్యక్షురాలు మౌనిక సుమన్, ప్రిన్సిపాల్ భారతి, వైస్ ప్రిన్సిపాల్ తుషార, విద్యార్థులు ధర్షఅండ్రియా, గుర్మన్, అర్జున్ పాల్గొన్నారు.

2 టన్నుల కూరగాయలు పంపిణీ

ప్రజాశక్తి - కంచికచర్ల : మండలంలోని గని ఆత్కూరు, మున్నలూరు గ్రామంలోని వరద బాధితులకు మండలం గొట్టుముక్కల గ్రామ కూటమి నాయకుడు గుదే వెంకటేశ్వరావు (బుజ్జి) 2 టన్నుల కూరగాయలు అందజేశారు. ఏటిపట్టు గ్రామాలైన గని ఆత్కూరు, మున్నలూరు గ్రామాలను వరద ముంచెత్తింది. ఇళ్లు నీట మునిగాయి. తనవంతుగా గుదే వెంకటేశ్వరరావు బుధవారం రెండు గ్రామాల బాధితులకు తన సొంత నిధులతో రెండు ఆటోలలో రెండు టన్నుల కూరగాయలు అందించారు.

వినాయకుని విగ్రహాలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - గంపలగూడెం : గణపతి నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకుని విగ్రహాల ప్రతిష్టకు ఆన్లైన్ అనుమతి తప్పనిసరి అని ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్‌లో పలువురు అధికారులు, గ్రామ స్థాయి ఉద్యోగులతో సమావేశమైన శ్రీనివాస్ ఈ విధంగా వివరించారు. ఒక విగ్రహాన్ని ప్రతిష్టించాలంటే పంచాయతీ, రెవెన్యూ, ఎలక్ట్రికల్, పోలీస్ శాఖల అనుమతులు ఉండాలన్నారు. ఈ నాలుగు శాఖల అనుమతులు ఓకే పేపర్‌పై ఉండాలని వివరించారు. అనుమతులు పొందా లంటే చలానా చెల్లించాలని, అంశాలను పూర్తిచేసిన అనం తరం మాత్రమే విగ్రహాల ప్రతిష్టకు పూనుకోవాలని తెలిపారు. తహశీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి, ఎంపిడిఒ ఎం.చెన్నయ్య, ఎఒ బి.సాయి శ్రీ, పిఒ అండ్‌పిఆర్‌డి ఆంగ్స్రాం, గ్రామ కార్యదర్శులు, విఎఎ లు ఉన్నారు.

గ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సాయం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ గ్రామంలోని గ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వరద ముంపునకు గురైన చిలుకూరులో గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ రెవరెండ్ డాక్టర్ మోగులూరి ఎలీషా ఆధ్వర్యంలో చిలుకూరు గ్రామంలో 200 కుటుంబాలకు పాలు రొట్టెలు కోడిగుడ్లు పంపిణీ చేశార. గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ ఎలీషా మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా అండగా ఉండటానికి తాము, గ్రేస్ మినిస్ట్రీస్ సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్ర క్షేమం, నాయకులు, ప్రభుత్వ అధికారులు, ప్రజలందరి క్షేమం కొరకు ప్రార్థించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ మినిస్ట్రీస్ సెక్రటరీ సుమలత, సభ్యులు అనిల్, నాగరాజు, జోజి, సుధాకర్, మోజెస్, వెంకటేష్, చిలుకూరు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. మండలంలో అనేక ప్రాంతాల్లో గ్రేస్ మినిస్ట్రీస్ ద్వారా జరుగుతున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని పలువురు కొనియాడుతున్నారు.

నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి నిరాశ్రాయులైన కుటుంబాలకు దహించు అగ్ని వ్యవస్థాపకులైన డాక్టర్ బిషప్. థామస్ పరామర్శించి మనోధైర్యం కలిగించి సింగ్ నగర్, అయోధ్య నగర్, బుడమేరు వంతెన పరిసర ప్రాంత ప్రజలకు సుమారు 500 మందికి నిత్యావసర వస్తువులు సుమారు ఒక్కరికి రూ.4వేల విలువ గలిగిన బియ్యం పప్పు, పంచదార టీ పొడి, ఉప్పు, కారం, ఆయిల్, దుప్పట్లు, ఇతర టాయిలెట్ సామాగ్రిని అందజేశారు. అందరూ త్వరగా తేరుకోవాలని వాళ్లకు ప్రస్తుత పరిస్థితి తొలగిపోయి మంచి రోజులు రావాలని ప్రార్థిస్తున్నానని బిషప్ చెప్పారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్మన్ అయిన పెరికెలా క్రిస్టోఫర్, స్థానిక సంఘ కాపారులు పాస్టర్ జోసెఫ్ అలెక్స్, పాస్టర్ ఆనంద్ సునీల్, బ్రదర్ ఆశీర్వాదం పాల్గొన్నారు. దహించు అగ్ని మినిస్ట్రీ సిస్టర్ కరిష్మా ప్రైజీ కార్యక్రమంను నడిపించారు.

పంపిణీలో వివాదం

ప్రజాశక్తి - మైలవరం : అర లీటరు పాల ప్యాకెట్, వాటర్ బాటిల్ పంపిణీలో టిడిపి నాయకులు ఎందుకు వివక్ష చూపుతున్నారంటూ బాధితులు ఆరోపించారు. ఈ సంఘటన మండలంలోని గణపవరంలో గురువారం జరిగింది. వరద ప్రభావంతో నివాస గహాల్లోకి నీరు చేరటంతో కొంతమంది పాఠశాలలు, కళాశాలలు, షాదిఖానాలు తదితర ప్రాంతాలలో తల దాచుకుంటున్నారు. కొంతమందికి తాగేందుకు నీరు, కనీస సౌకర్యాలు కూడా అందకపోవటంతో స్థానిక ఎంఎల్ఎ వసంత కృష్ణ ప్రసాద్ మండలాల వారీగా అర లీటర్ పాల ప్యాకెట్‌లు, ఒక వాటర్ బాటిల్ ప్రతి ఒక్కరికి అందేలా స్థానిక నాయకులకు పంపిణీ చేసే కార్యక్రమం అప్పగించారు. స్థానిక టిడిపి నాయకులు ఐదు ట్రాక్టర్లతో వడ్డెర, గౌడ, ఎస్సీ కాలనీలోని ఒక ప్రాంతం వారికి పంపిణీ చేశారు. చివరగా ఎస్‌సి కాలనీలోని మరో వర్గం వద్దకు వచ్చారు. దీంతో కొంతమంది పెద్దలు అందరికీ పంచిన తర్వాత చివరలో తమ దగ్గరకు వచ్చారని ఇందులో కూడా వివక్ష చూపుతున్నారా అని ప్రశ్నించారు. కొంతసేపు ఎస్సీల్లోని ఒక వర్గం నాయకులకు, స్థానిక టిడిపి నాయకులకు కొంతసేపువాదోపవాదాలు జరిగాయి. దీంతో పంపిణీ కార్యక్రమం కాస్త ఆగిపోయింది. మరల రాత్రిపూట పంపిణీ చేశారు, రాత్రిపూట ఇచ్చిన పాలు కాస్త విరిగిపోయాయని ఎస్సీల్లోని ఒక వర్గం వారు ఆరోపిస్తున్నారు. దీంతో తమపై ఇలాంటి సమయంలో కూడా ఎందుకింత వివక్ష చూపుతున్నారంటూ పెదవి విరుస్తున్నారు.

పంట నష్టం అంచనా వేయాలి

ప్రజాశక్తి - గంపలగూడెం: రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన తుఫానుతో దెబ్బతిన్న పంటల నష్టపరిహారానికి అంచనాలు తయారు చేయాలని గంపలగూడెం మండల వ్యవసాయ అధికారి బి.సాయి శ్రీ తెలిపారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్‌లో విఆర్ఒ, విఎఎలతో సమావేశమ య్యారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఒక రైతు ఎన్ని చోట్ల సాగుచేసినా, కేవలం అత్యధికంగా ఐదు ఎకరాలకు మాత్రమే పరిహారం అందుతుందని చెప్పారు. ప్రధానంగా వరి, పత్తి పంటలను పరిశీలించి, సంబంధిత ఫీల్డ్ ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ అంచనాలకై మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక బృంధాలు ఉంటాయన్నారు. పదో తేదీ లోపల వివరాలతో కూడిన మొత్తాన్ని ప్రభుత్వానికి పంపాలని వివరించారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక మండల పరిషత్ సమావేశపు మందిరంలో మండల విద్యాశాఖ, యు టి ఎఫ్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ జగన్మోహన్ రావు సర్వేపల్లి రాధాకష్ణ ఘనతను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి కష్ణవేణి, ఇంచార్జ్ తాసిల్దార్ కనకదుర్గ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఏ.వి వరలక్ష్మి, ఎల్ నరేంద్ర, మాజీ జిల్లా కార్యదర్శి కేఎల్ శ్రీనాథ్, మండల అధ్యక్షురాలు ఎం ఆరోగ్యం పాల్గొన్నారు.

మచిలీపట్నం రూరల్ : విద్యార్థుల ద్వారానే ఉత్తమ గురువును ఎంపిక చేయాలని, ఆ దిశగా విశ్వవిద్యాలయ అధ్యాపకులు అడుగులు వేయాలని కష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఆర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, ఇంజినీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాల ల ఆధ్వర్యములో వేర్వేరుగా నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు ఉపకులపతి ఆచార్య ఆర్ శ్రీనివాసరావు ను ఘనంగా సత్కరించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యులు ఆచార్య ఎన్ ఉష, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, డీన్ ఆచార్య సుందర కృష్ణ పాల్గొన్నారు. **బంటుమిల్లి :** బంటుమిల్లి ప్రభుత్వ కళాశాలలో గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ జగన్ మోహన్ రావు సారధ్యంలో ఈ వేడుకల్లో బి. దేవజయరాజు, డాక్టర్ జి బి ఆనంద్ కుమార్, జహీదాబేగం, డా. సత్యరాజేష్, జ్యోత్స్న, సుజాత పాల్గొన్నారు. **పమిడిముక్కల :** వీరంకి పాఠశాలలో పనిచేస్తున్న వీరంకి వెంకటేశ్వరరావుకు ఉత్తమ అవార్డు రావడం అభినందనీయమని పమిడిముక్కల మండల ఎంఈఓ 2 శ్రీనివాస్ అన్నారు.ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా అవార్డు అందుకోవడం గొప్ప విషయమని ఆయన అన్నారు. **మోపిదేవి :** బిసి రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ కెవి రవి, మోపిదేవి హై స్కూల్ హెచ్ఎం పి జయంతి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికై మోపిదేవి మండలానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టడం పట్ల ఎంఈఓ విద్యాసాగర్ అభినందించారు.

కేసరపల్లిలో ముఖ్యమంత్రి పర్యటన

ప్రజాశక్తి-గన్నవరం : కేసరపల్లిలో బుడ మేరును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం పరిశీలించారు. వరద ఉదతంగా వాడడాన్ని ఆయన గమనించారు. పొలాలు నీటిలో ఉండటాన్ని చూశారు. ప్రసాదంపాడు ఏరియాలో మునిగిన ఇళ్లను చూశారు. ఏలూరు కాలవలో పడవపై ప్రయాణించి ముంపు పొలాలను పరిశీలించారు. ఆయనతో పాటు అధికారులు ఉన్నారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-గన్నవరం : కృష్ణాజిల్లాలో ఇటీవల వరదలకు దెబ్బతిన్న పంటల నష్టాన్ని గురువారం జిల్లా కలెక్టర్ బాలాజీ కేసరపల్లిలో పరిశీలించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడారు. గన్నవరం మండలం కేసరపల్లి ఎస్ ఎల్ వి లైలా గ్రీన్ మెడోస్ వద్ద స్థల పరిశీలన చేశారు. దెబ్బ తిన్న వరి పైరు చూసారు. జిల్లా పోలీసు అధికారి ఆర్ గంగాధర్ రావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో ఆహారం అందజేత

ప్రజాశక్తి-గన్నవరం : వరద ముంపు ప్రాంతాలైన సింగ్ నగర్ లో కల పైపులు రోడ్డు రాజరాజేశ్వరి పేట రైతు బజార్ రోడ్లలో గల నివాసులకు స్వయంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, వాసవి మిత్ర యూత్ ఆధ్వర్యంలో 500 కిట్ లు పంపిణీ చేశారు. ఆ కిట్టు నందు వాటర్, పాలు, బ్రెడ్ బిస్కెట్స్ , కొవ్వొత్తులు, అగ్గిపెట్టి, అరటి పండ్లు, జామకాయలు కలిపి ప్యాక్ చేసిన ప్యాకెట్లను దాతల సహాయ సహకారాలతో ఇచ్చారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో విజయవాడ సింగ్ నగర్ పరిసర ప్రాంతాలలో వరద బాధితులకు గురువారం ఆహర పదార్థాలను,బిస్కట్లు అందించారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ సభ్యులు బావిశెట్టి ప్రదీప్, వేమూరి వేణు,జొన్నలగడ్డ శ్రీనివాస్ పాల్గొన్నారు. **మోపిదేవి :** మండలం కొత్తపాలెం కరకట్టపై వరద బాధితులకు దుప్పట్లు, నిత్యవసర వస్తువులను శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, జనసేన పార్టీ అధ్యక్షులు సుంకర శ్రీనివాస్ పంపిణీ చేశారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలో కౌతవరం 1వవార్డ్ పుల్లేరు కాలువగట్టు పైనచెంచుల కుటుంబాలకు చెందిన 55 మందిని కౌతవరం మెయిన్ స్కూల్ నందు పునరావాస కేంద్రానికి బుధవారం రాత్రి తరలించినట్లు ఇంచార్జ్ తాసిల్దార్ కనకదుర్గ తెలిపారు. ఏఎస్ఐ సారధి బాబు, ఆర్ ఐ షకీలా బేగం, వీఆర్వో మల్లికార్జునరావు టిడిపి పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యం, వెంకన్నపలువురు భోజనాలను ఏర్పాటు చేశారు.

కూలిన రిటైనింగ్ వాల్ నిర్మించాలి

50వ డివిజన్ కార్పొరేటర్ సత్యబాబు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు క్వారీ కొండ పైభాగంలో ఆకుల అన్నపూర్ణ ఇంటి రిటైనింగ్ వాల్ కింద ఉన్న ఇళ్ళపై గురువారం పడింది. శ్రీకాకుళం లక్ష్మి, మరొక ఇంటిపై పడటంతో కొంతమేర నష్టం వాటిల్లింది. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సత్యబాబు సంఘటన ప్రాంతానికి వెళ్లి పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సంధర్భంగా సత్యబాబు మాట్లాడుతూ కూలిపోయిన ఇంటి రిటైనింగ్ వాల్‌ను అధికారులు వెంటనే నిర్మించాలని సత్యబాబు విఎంసి అధికారులను కోరారు.

ఆర్థిక సాయం పంపిణీ

ప్రజాశక్తి - భవానీపురం : పశ్చిమ నియోజకవర్గం చిట్టినగర్ సమీపంలోని కెఎల్ రావు నగర్‌లో గురువారం అనారోగ్యంతో మరణించిన మానేపల్లి సుబ్బారావు కుటుంబానికి ఎంఎల్‌ఎ సుజనా చౌదరి ఆదేశాలతో ఆర్థికసాయం అందించారు. ఎంఎల్‌ఎ కార్యాలయ సిబ్బంది ఎన్‌డిఎ కూటమి నాయకులతో కలిసి కుటుంబాన్ని పరామర్శించారు. విషయాన్ని 46వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గుర్రం కొండ సుజనా దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే తమ కార్యాలయ సిబ్బందికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను అందజేశారు.

బాధితులకు ఆకుల కుటుంబం సాయం

ప్రజాశక్తి - భవానీపురం : ఐదు రోజులుగా బుడమేరు వరదలో చిక్కుకున్న వరద బాధితులకు గురువారం ప్రముఖ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్, ఆయన కుటుంబ సభ్యులు అవసరమైన ఆహార పదార్థాలను అందజేశారు. వైఎస్ఆర్ కాలనీ జక్కంపూడి గ్రామ ప్రాంతం, ఊర్మిళానగర్, రెడ్డి కాలనీ, ఏకలవ్య నగర్, జోజి నగర్, కబేళా సెంటర్, రామరాజ్యనగర్ తదితర ప్రాంతాల్లోని వారికి ఆకుల శ్రీనివాస్ కుటుంబ సభ్యులు నిత్య అవసరాలైన భోజనం ప్యాకెట్లు, మంచినీళ్లు, పాలు, బిస్కెట్లు తదితర ఆహార పదార్థాలను తీసుకెళ్లి అందజేశారు. నాలుగు రోజులుగా ట్రాక్టర్లతో ఆహార పదార్థాలను తీసుకెళ్లి బాధితులకు ఆకుల శ్రీనివాస్ కుటుంబ సభ్యులు అందజేస్తూ వస్తున్నారు. ఆకుల దినేష్ కుమార్, ఆకుల విజయ్ కుమార్, ఆకుల రాజ్ కుమార్, పులి కార్తీక్, ఆత్మూరి సూర్య, ఫిరోజ్ ఖాన్, భాషా, ఖాజా, రవీంద్ర, ఫణీంద్ర, బిల్లా సుబ్బారావు, వినయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధికి బుద్ధా రూ.5లక్షలు అందజేత

ప్రజాశక్తి - వన్‌టౌన్ : వరద బాధితుల సహాయార్థం సి.ఎం సహాయ నిధికి టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న రూ.5 లక్షలు సహాయాన్ని అందజేశారు. జాతీయ అధ్యక్షులు, టిడిపి అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు స్పందించిన బుద్ధా వెంకన్న గురువారం కలెక్టరేట్ వద్ద రాష్ట్ర టిడిపి అధ్యక్షులు పల్ల శ్రీనివాస్, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి వరద బాధితుల సహాయార్థం రూ.5 లక్షల చెక్‌ను ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. పశ్చిమ నియోజకవర్గం టిఎన్‌టియుసి గౌరవ అధ్యక్షులు కాండ్రేగుల రవీంద్ర పాల్గొన్నారు.

గోసలైట్స్ మెడికల్ అకాడమీ సాయం

విజయవాడ : వారం రోజులుగా ఇబ్బందులులు పడుతున్న వరద బాధితులకు నగరంలోని శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీ నుంచి ఆర్థిక సాయం అందజేశారు. అకాడమీ చైర్మన్ నరేంద్ర బాబు రూ.25 లక్షలు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది రూ.10 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా అందజేశారు. చంద్రబాబును కలిసి గురువారం ఈ సాయం అందించారు. నరేంద్రబాబు మాట్లాడుతూ తమకు తోచిన సాయం అందించామని, ఇది తమకు తృప్తినిచ్చిందని అన్నారు.

ప్రభుత్వాస్పత్రికి మరో 4 మృతదేహాలు

22 మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టడంతో వరదల కారణంగా ఇప్పటి వరకు బయటకు రాలేని వారంతా బయటకు వచ్చి వరదల కారణంగా తప్పిపోయిన, కనపడకుండా పోయిన వారి కోసం వెతుకులాట కనిపించింది.ఇదిలా ఉంటే వరదల కారణంగా చనిపోయిన వారి మృతదేహాలను నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తీసుకువస్తున్నారు. దీనితో గురువారం పెద్ద సంఖ్యలో వరద బాధితులు కనిపించకుండా ఉన్న తమ వారి కోసం పెద్ద సంఖ్యలో మార్చురీ వద్దకు చేరుకుని తమ వారి ఆచూకి ఏమైనా దొరుకుతుందోనని ఆశగా ఎదురుచూస్తున్నవారు కొందరయితే వరదల కారణంగా మరణించిన వారి మృత దేహాలను మార్చురీ వద్దకు తీసుకురావడంతో వారిని చూసి బంధువులు, కుటుంబ సభ్యులు ఒక్కసారిగా కన్నీటి పర్యంతమవుతున్నారు. మార్చురీ వద్దకు వచ్చిన మృతదేహాలను చూసి గుర్తు పట్టిన వారు కొంత మంది రోధిస్తున్న దృశ్యం కనిపిస్తుంది. ఇలా ఉంటే వరద నీళ్లలో చిక్కుకుని ఉబ్బిపోయి, డీకంపోజ్ అయిన మృత దేహాలు కూడా మార్చురీ వద్దకు తీసుకువచ్చారు. గుర్తుతెలియని మృత దేహాలు కూడా అలాగే పడిఉన్నాయి. వరదల కారణంగా ఇప్పటి వరకు గురువారం సాయంత్రం 5 గంటల వరకు నగరంలోని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి 28 మృత దేహాలు వచ్చినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. వీటిలో 22 మృత దేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఆరు మృత దేహాలు గుర్తుతెలియని వారివి ఉన్నాయి. వీటికి ఇంకా పోస్టుమార్టం చేయాల్సి ఉంది.

ఆందోళనలో కుటుంబ సభ్యులు....

వరదల కారణంగా వారి కుటుంబ సభ్యులు, బంధువులు కనపడకుండా పోయారు. దీనితో వారి సెల్‌ఫోన్లు కూడా పనిచేయకపోవడం మరోవైపు ప్రభుత్వాసుపత్రికి వరదల్లో చిక్కుకుని మృతి చెందిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువస్తున్నారు. దీనితో తమ వారికి ఏమైందో నని ఆసుపత్రి వద్దకు వచ్చి కొంత మంది కుటుంబ సభ్యులు విచారణ చేస్తున్నారు. వారి బంధువులు ఏమయ్యారో తెలియక తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

రైతు అదృశ్యం

వలకు చిక్కిన బైకు

ప్రజాశక్తి - తిరువూరు : అదృశ్యమైన వ్యక్తి బైక్ వాగులో చేపలు పడుతున్న వలకు చిక్కిన సంఘటన చింతల పాడులో చోటు చేసుకుంది. తిరువూరు మండలం లోని వావిలాల గ్రామానికి చెందిన కోట వెంకటరావు (50) కనిపించట్లేదని, ద్విచక్ర వాహనంపై గత నెల 31న రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి ఇప్పటివరకు తిరిగి రాలేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. అతని ద్విచక్ర వాహనం చింతలపాడు గుర్రపు వాగులో గురువారం చేపల వలలో చిక్కిందని, వెంకటరావు ఆచూకీ తెలియాల్సి ఉందని ఎస్ఐ పేర్కొన్నారు. వెంకటరావు భార్య గతంలో మృతి చెందగా, ఇరువురు కుమార్తెలకు వివాహమైంది. తల్లిదండ్రులతో కలిసి వావిలాలలో నివసిస్తున్న వెంకటరావు వ్యవసాయ పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు.

బీమా రంగంలో తిరుగులేని శక్తిగా ఎల్ఐసి

ప్రజాశక్తి - తిరువూరు : భీమా రంగంలో అగ్రగామి సంస్థ భారతీయ జీవిత బీమా సంస్థ ఎల్ఐసి తిరుగులేని శక్తిగా ఆవిర్భవించిం దని తిరువూరు శాటిలైట్ కార్యాలయ బ్రాంచ్ మేనేజర్ ఎం రమేష్ అన్నారు. ఎల్ఐసి 68వ ఆవిర్భావ దినోత్స వం సందర్భంగా తిరువూరు శాటిలైట్ కార్యాల యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. బిఎం అధ్యక్షతన డెవల ప్మెంట్ ఆఫీసర్లు కేదార్నాథ్, వెంకటే శ్వర్లు, శివరామ కష్ణారావు, మహేశ్వర్ యాదవ్, మహే ష్ బాబు, గ్లాడి షోరోన్ లను, క్లియ ఏజెంట్లను ఎల్ఐసి ఏజెంట్లు, కార్యాలయ సిబ్బంది సన్మానించారు.

లైన్‌మెన్ కుటుంబానికి ఆర్థిక చేయూత

ఇబ్రహీంపట్నం : విధులు నిర్వర్తిస్తూ మృతిచెందిన లైన్ మెన్ కుటుంబానికి ఆర్థిక చేయూతను ప్రభుత్వం అందించింది. లైన్‌మెన్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, రూ.32.25 లక్షల ఎక్స్ గ్రేషియోను గురువారం మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే కష్ణప్రసాదు అందజేశారు. ఇటీవల కృష్ణా నది వరదనీటిలో పడి ప్రమాదవశాత్తు మృతి చెందిన లైన్‌మెన్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంది. లైన్‌మెన్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, రూ.32.25 లక్షల ఎక్స్ గ్రేషియో, అతని పిల్లలకు డిగ్రీ పట్టభద్రులు అయ్యేంత వరకు సంవత్సరానికి ఒక్కొక్కరికి రూ.25వేలు చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ గురువారం రాత్రి చెక్కును, ఉత్తర్వులను బాధిత కుటుంబానికి అందజేశారు. విధి నిర్వహణలో ఉన్న లైన్‌మెన్ మృతి గురించి, ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని, గౌరవ మంత్రి నారా లోకేష్ దృష్టికి మైలవరం ఎంఎల్‌ఎ వసంత వెంకట కృష్ణ ప్రసాద్ తీసుకువెళ్లారు.

ఉపాధ్యాయులు సమాజాభివృద్ధికి దిక్సూచి

ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంతో పాటు ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు దిక్సూచి వంటి వారని ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా కృష్ణాజిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ తరగతిలో బోధించే పాఠాలతో పాటు విద్యార్థులలో భౌతిక వ్యక్తిత్వం, మేధో వ్యక్తిత్వం, నైతిక వ్యక్తిత్వం పెంపొందించాలని సూచించారు. కేవలం మార్కుల కోసం బోధించడమే సరిపోదని, విద్యార్థి చదివింది అర్థం చేసుకుని తన భాషలో వ్యక్తం చేసేలా, సొంతంగా రాయగలగటం, రైటింగ్ స్కిల్స్ పెంపొందించడం, భాషపై పట్టు సంపాదించేలా బోధిస్తే వారి జీవితాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని, ఉత్తమ పౌరులుగా సమాజానికి దేశానికి ఉపయోగపడతారని అన్నారు. మార్కుల వెంటపడితే చాలదని, ప్రతి ఒక్కరు బాధ్యత గల పౌరులుగా ఎదగగలిగితే సమాజంలో మార్పు వస్తుందని చెప్పారు. ప్రతిరోజు విద్యార్థులకు స్ఫూర్తివంతమైన వ్యక్తుల కథనాల గురించి బోధించి

సర్వేపల్లికి నివాళులర్పిస్తున్న ఎంఎల్‌సి లక్ష్మణరావు

స్ఫూర్తిదాయకంగా, మార్గదర్శకులుగా నిలవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం ఉపాధ్యాయులకు ఎంతో విశిష్టమైనదన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దే గౌరవప్రదమైన వృత్తి ఉపాధ్యాయ వత్తి అన్నారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు వస్తుందన్నారు. పేదవారికి కూడా ఉన్నత విద్యను ప్రభుత్వాలు అందుబాటులోకి తెచ్చాయన్నారు. డీఈవో తాహెరా సుల్తానా మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో 45 మంది ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికయ్యారని, వీరిలో నలుగురు ప్రధానోపాధ్యాయులు, 20 మంది స్కూల్ అసిస్టెంట్లు, 21 మంది ఎస్జీటీలు ఉన్నారని తెలిపారు. చివరిగా వీరందరికీ పురస్కారాలు ప్రదానం చేశారు.

పారిశుధ్య పనులు చేపట్టిన అగ్నిమాపక, పురపాలక శాఖ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక భవానీపురం ప్రాంతంలో పారిశుధ్య పనులను అగ్నిమాపక శాఖ, నగరపాలక శాఖ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అధికారుల పర్యవేక్షణలో పారిశుధ్య పనులను నిర్వహించారు. సెక్రెటరీ మీనా, కమిషనర్ నిశాంత్ కుమార్ ఆదేశాలతో ఎక్సైజ్ శాఖ సిబ్బంది గురువారం భవానీపురం స్వాతి థియేటర్ రోడ్డు, పున్నమిఘాట్ తదితర వరద బాధిత ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. అగ్నిమాపక, పురపాలక శాఖ అధికారుల సమన్వయంతో రోడ్ల మీద, నివాసాలలో ఉన్నటువంటి బురద మట్టిని శుభ్రపరిచారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్, క్లోరినేషన్ చేయించారు. వరద బాధిత ప్రాంతాల్లోని నివాసితులకు 25 వేల మంచినీటి బాటిళ్లు, 20 వేల పాల ప్యాకెట్లు ,16 వేల ఆహారపు ప్యాకెట్లను ఇప్పటివరకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్లు, ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

దిక్కు తోచని స్థితిలో బాధితులు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి కొత్త గేటు సత్తెమ్మ తల్లి గుడి వద్ద శాంతా నగర్ లో భారీగా నీరు చేరడంతో దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లల్లోకి నీరు చేరిందని, నీరు పోయే విధంగా చర్యలు చేపట్టాలని, కట్టుబట్టలతో ఉన్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని జి రమణమ్మ కోరుతున్నారు. మోకాళ్ళ లోతు నీళ్లలో అట్లాగే ఇళ్లల్లో ఉండాల్సిన పరిస్థితి ఉంటుందని, పాములు ఇతర ప్రమాదకరమైన సర్పాలు వచ్చి మా ప్రాణానికి హాని, కనీసం వసతులు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేశారు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో వైఎస్ఆర్ కాలనీ ఇందిరమ్మ కాలనీ సత్యమ్మ తల్లి శాంతా నగర్ ఏబీఎన్ పేటలో చివరి వీధుల్లో అరుణ నగర్ కోటయ్య నగర్‌లో ఇబ్రహీంపట్నం బెర్రీ దుర్గా కాలనీ ఆంజనేయ కాలనీ, ఆర్టీసీ కాలనీ జాకీర్ హుస్సేన్ కాలేజ్ రోడ్డు వరద బాధితులకు తక్షణమే సాయం ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం భోజనాల వరకే పరిమితం అవుతుందని చిన్నపిల్లలకు, పాలు ఇతర తినుబండరాలు సరఫరా చేయాలన్నారు.

రూ.1.50 లక్షల విరాళం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు గ్రామానికి చెందిన గొరిజాల హరిశ్చంద్రరావు (చిన్నబ్బాయి) వారి ధర్మపత్ని, గొరిజాల అనసూయమ్మ వారి కుమారులు, టిడిపి నాయకులు గొరిజాల సాంబశివరావు (చిన్ని) వరద బాధితుల సహాయార్ధం రూ.1.50 లక్షల విరాళం అందజేశారు.

కొండ చరియలు పడిన ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి ఇటీవల భారీ వర్షాలకు దుర్గగుడి కొండ ప్రాంతంలో కొండ చరియలు పడి ఘాట్ రోడ్ నందు దెబ్బతిన్న ప్రాంతాన్ని సిద్దార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీన్ పాండురంగారావు గురువారం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కాలేజీ డీన్ పాండురంగారావుతో కలిసి ఆలయ ఈవో కెఎస్ రామారావు పరిశీలన చేశారు. కొండ ప్రాంతంలో ఇటీవల దెబ్బతిన్న ప్రాంతంలో మళ్ళీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా రిటైనింగ్ వాల్ నిర్మించుటకు ప్లాన్స్‌ను అతి తక్కువ సమయంలో దేవస్థానానికి అందజేస్తామని సిద్దార్థ కాలేజీ డీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఈ కెవిఎస్ కోటేశ్వరరావుతో పాటుగా ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.